ఈనాడు
పశ్చిమగోదావరి
సోమవారం ఆగస్టు 31, 2026

నిఘా కళ్లకు.. నిర్లక్ష్యపు గంతలు

పరిశీలన

అలంకార ప్రాయంగా గత పుష్కరాల నాటి కెమెరాలు



భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: గోదావరి మహా పుష్కర్-2027 ఏర్పాట్లపై ప్రభుత్వం దృష్టి సారించింది. లక్షల్లో భక్తులు తరలివచ్చే ఈ వేడుకల్లో నిఘా ఎంతో కీలకం. ట్రాఫిక్ నిలిచిపోయే అవకాశం ఉన్నా, ప్రమాదాలు జరిగినా, దొంగలను పట్టుకునేందుకైనా సీసీ కెమెరాలు అవసరం ఉంది. 2015 పుష్కరాల సమయంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో 847 చోట్ల వీటిని ఏర్పాటు చేయగా అప్పట్లో అవి ఎంతో ఉపయోగపడ్డాయి. మరికొద్ది నెలల్లో పుష్కరాలు మళ్లీ ప్రారంభం కానుండటంతో యంత్రాంగం ఇప్పట్నుంచే అప్రమత్తం కావాల్సిన అవసరం ఉంది.

గత పుష్కరాల సమయంలో భీమవరం ప్రకాశం చౌక్ వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరా ఇది. కాలక్రమంలో నిర్వహణ లేక అలంకారప్రాయంగా మిగిలింది. తరువాత ఇక్కడ అమర్చిన సీసీ కెమెరాల్లోనూ కొన్ని పనిచేయడం లేదు. భీమవరంలో ప్రాంతీయ ఆసుపత్రి ఎదురుగా, పోలీసు బొమ్మ, ఇతర ప్రధాన కూడళ్లలోనూ సీసీ కెమెరాలకు తీగలు ఊడిపోయి వేలాడుతున్నాయి. ఫుటేజీ, ఇతర పరికరాలు ఉండే పెట్టెలకు ఎలాంటి రక్షణ లేదు.

ఉన్నవి పనిచేయక ఇక్కట్లు

ముఖ్య కూడళ్లు, రహదారుల వెంబడి ఉన్న సీసీ కెమెరాల్లో కొన్ని పనిచేయకపోవడంతో ఫుటేజీ అవసరమైనప్పుడు పోలీసులు, ఇతర శాఖల అధికారులు ప్రైవేటు సీసీ కెమెరాలపై ఆధారపడుతున్నారు. కొన్నేళ్ల కిందట సూదితో గుచ్చి వందలాది మందిని గాయపరుస్తూ ప్రజలు, పోలీసు యంత్రాంగానికి కునుకు లేకుండా చేసిన యువకుడి చిత్రం భీమవరం పోలీసుబొమ్మ కూడలిలోని సీసీ కెమెరాలో రికార్డయినా.. అది సరిగా కనిపించకపోవడంతో నిందితుడిని గుర్తించలేకపోయారు. ఉండిలో ఓ నగల దుకాణంలో దుండగులు చోరీ చేసిన సొత్తుతో ప్రధాన రహదారి మీదుగా పరారైన ఘటనలోనూ.. సీసీ కెమెరాలు సక్రమంగా లేకపోవడంతో నేరస్థుల గుర్తింపులో ఇబ్బందులు ఎదురయ్యాయి.

ప్రధాన మార్గాల్లో కీలకం

తాడేపల్లిగూడెం, తణుకు, భీమవరం, మొగల్తూరు మీదుగా నరసాపురం, ఆకివీడు, పాలకొల్లు తదితర ప్రాంతాల మీదుగా ఉన్న జాతీయ రహదారుల వెంబడి మరిన్ని సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. పుష్కరాల సమయంలో ట్రాఫిక్ ఇబ్బందులు ఎప్పటికప్పుడు గుర్తించేందుకు వీలుగా అవసరమైన ప్రాంతాల్లో వీటిని ముందుగానే ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

అస్తవ్యస్తంగా..

జిల్లాలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో 410 సీసీ కెమెరాలు ఉన్నాయి. చాలా చోట్ల వీటి బాక్సులు ఊడిపోయి, తీగలు వేలాడుతూ, కెమెరాలు దారులవైపు లేకుండా మరోపక్క తిరిగి ఉన్నాయి. సుప్రీంకోర్టు ఆదేశాలతో పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఏర్పాటు చేసిన కెమెరాలు కూడా సక్రమంగా పనిచేయడం లేదు. గత పుష్కరాల సమయంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు.. తరువాత కొద్దికాలం పాటు సజావుగా సేవలందించి నేరాలు, ప్రమాద కేసుల దర్యాప్తులో ఉపయోగపడ్డాయి. అవి వినియోగంలో ఉన్నంతకాలం రహదారిపై ప్రయాణించిన ప్రతి వాహనం వివరాలు పోలీసులకు తెలుసుకునే అవకాశం ఉండేది. కాలక్రమంలో నిర్వహణ లేక ఒక్కొక్కటిగా పనిచేయకుండా పోయాయి.

మనసారా.. మహా సారె



భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: శ్రావణ మాసం సందర్భంగా పంచారామ క్షేత్రం సోమేశ్వర జనార్దన స్వామి ఆలయం (సోమారామం)లో సారె మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. ధర్మకర్తల మండలి ఛైర్మన్ చింతలపాటి బంగార్రాజు, సభ్యులు, వివిధ సంస్థలు, భక్తులు కావిళ్లు, ఎడ్ల బళ్లలో దాదాపు 8 వేల కిలోల సారెతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు ప్రారంభించారు. అర్చకులు సంప్రోక్షణ చేసి అనంతరం సారెను పార్వతీమాత, అన్నపూర్ణమ్మలకు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వాటిని భక్తులకు పంపిణీ చేసినట్లు ఆలయాధికారి రామకృష్ణంరాజు తెలిపారు.



ఊరేగింపుగా ఆలయానికి వస్తున్న భక్తులు

పెద్దపులి కోసం అన్వేషణ



దేవరగొంది ముంపు గ్రామం పరిధిలో పులికోసం గాలిస్తున్న అటవీశాఖ అధికారులు

పోలవరం, న్యూస్‌టుడే: మూడు రోజులుగా పోలవరం ప్రాజెక్టు ముంపు గ్రామాల పరిధిలో తిరుగుతున్న పెద్దపులి ఆదివారం ఉదయం పి.రెగ్యులేటర్, దేవరగొంది జంట సొరంగాల పరిసరాల్లో తిరుగుతున్నట్లు అటవీశాఖ అధికారులు గుర్తించారు. వెంటనే జలవనరులశాఖ అధికారులతోపాటు మన్యం ప్రతినిధులకు తెలియజేసి హుటాహుటిన అక్కడికి వెళ్లారు. పెద్ద పులి పి.రెగ్యులేటర్ సమీపంలో రెండు గేదె దూడలపై దాడి చేసినట్లు తెలుసుకున్నారు. వాటిలో ఒకటి మరణించగా.. మరొకదానికి గాయం కావడంతో పశు వైద్య సిబ్బందిని రప్పించి చికిత్స చేయించినట్లు పోలవరం అటవీశాఖ అధికారి ఎస్కే వలీ చెప్పారు. సిబ్బంది పరిసరాల్లో జరిపిన గాలింపులో ఆవు మృతదేహాన్ని గుర్తించారు. నెలరోజులుగా మండలంలోని ముంపు గ్రామాల్లో మకాం వేసిన పెద్దపులి తిరిగి ప్రయాణం ప్రారంభించి శనివారం రాత్రి ఇటుకలకోట, మెత్తప్పకోట కొండల్లో ప్రయాణం చేసి తెల్లవారే సరికి పి.రెగ్యులేటర్ వద్దకు చేరుకున్నట్లు ట్రాకర్ ద్వారా గుర్తించారు. పోలవరానికి ఏడు కిలోమీటర్ల దూరంలో పెద్ద పులి మకాం వేయడంతో జంట సొరంగాల పనులు చేస్తున్న కార్మికులతో పాటు పరిసర గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

పట్టుకునే పనిలో..

ప్రాజెక్టు పరిసరాల్లో ఉన్న పులిని పట్టుకునేందుకు మత్తు ఇచ్చే షూటర్లు, రెస్క్యూ బృందాలతోపాటు వెటర్నరీ సిబ్బందిని రప్పించారు. రాజమహేంద్రవరం అటవీశాఖ అధికారి దావీద్ రాజు వారి వెంట వచ్చారు. ప్రాజెక్టులో పనిచేసే కార్మికులు రాత్రి సమయంలో ఒంటరిగా బయటకు రావద్దని అటవీశాఖ సిబ్బంది హెచ్చరించారు.

ఉల్లిక్కి పడేలా.. కన్నీరు కార్చేలా!



తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: నిత్యావసరాల్లో ఉల్లి లేని ఇల్లంటూ ఉండదు. ఉభయ జిల్లాల్లో ప్రధానమైన తాడేపల్లిగూడెం బ్రహ్మానందరెడ్డి మార్కెట్‌లో ఉల్లిపాయల ధర ఆకాశాన్ని అంటుతుంది. ఆదివారం మార్కెట్‌లో కిలో ఉల్లి రూ.50 పలికింది. దీంతో సామాన్యులు కొనాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత నెల వరకు కిలో రూ.25 నుంచి రూ.35 మధ్య ఉంటే ప్రస్తుతం ఒక్కసారిగా ధర పెరగడంతో పరిస్థితి దారుణంగా మారింది. వర్షాభావంతో కర్నూలు ఉల్లి పంట దిగుబడి తగ్గింది. ఏటా ఈ సీజన్‌లో మార్కెట్‌కు రోజూ 5 నుంచి 10 లారీలు రాగా ప్రస్తుతం 2 లారీల సరకు వస్తుంది. మహారాష్ట్ర నుంచి 10 లారీల ఉల్లి రావాల్సి ఉండగా 5 వరకు వస్తుంది. ఈ నేపథ్యంలో ఉల్లి ధర క్రమంగా పెరుగుతుంది.

పొట్లకాయ.. ఎంత పొడవో

సాధారణంగా పొట్లకాయ మూడు నుంచి నాలుగు అడుగుల మేర, అదే హైబ్రీడ్ రకమైతే ఆరడుగుల మేర పొడవు పెరుగుతాయి. కొయ్యలగూడెం మండలం దిప్పకాయలపాడులో రైతు గెడా దుర్గారావు ఇంటివద్ద పెంచిన పొట్ల పాదుకు పది అడుగుల మేర పెరిగాయి. ప్రస్తుతం కాయలు లేతగానే ఉన్నాయని ఇంకా పొడవు పెరుగుతాయని రైతు చెబుతున్నారు.

- న్యూస్‌టుడే, కొయ్యలగూడెం



పనులు చకచకా..

సీఎం పర్యటన ఏర్పాట్లు యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలి: కలెక్టర్

నరసాపురం, మొగల్తూరు, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లలో ఎటువంటి లోపాలు లేకుండా యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని కలెక్టర్ సీహెచ్ నాగరాణి సూచించారు. నరసాపురంలో వచ్చే నెల 1న సీఎం పర్యటించనున్న నేపథ్యంలో అక్కడ చేస్తున్న ఏర్పాట్లను ఆదివారం కలెక్టర్ పరిశీలించారు. అనంతరం స్థానిక లక్ష్మీహరిప్రియ కల్యాణ మండపంలో ఆయా పనుల బాధ్యులు, జిల్లా, డివిజన్ అధికారులు, సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ముఖ్యమంత్రి పర్యటించనున్న ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహిస్తున్నామని, ఆయా ప్రాంతాల్లో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశామని ఎస్పీ అద్నాన్ నయీం అస్మి వెల్లడించారు. కార్యక్రమంలో జేసీ కేఆర్ కల్పశ్రీ తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సిద్ధమవుతున్న ప్రజా వేదిక



క్యాడర్ సమావేశానికి ఏర్పాటు చేస్తున్న షెడ్డు

నరసాపురం పట్టణంలోని పొన్నపల్లి, ప్రధాన మార్గాల్లో, వలందర రేవు తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు చేపట్టారు. మొగల్తూరు కుక్కలవారితోటలో చేపట్టిన హెలిప్యాడ్ నిర్మాణం పూర్తికావచ్చింది. పోలీస్‌స్టేషన్ సమీపంలో ఉన్న లేఅవుట్‌లో క్యాడర్ సమావేశానికి షెడ్డు నిర్మాణం చేస్తున్నారు. పాత కాలువ ప్రాంతంలోని వైజంక్షన్ వద్ద ఉన్న లేఅవుట్‌లో ప్రజావేదిక, స్టాళ్ల ఏర్పాటు తదితర వాటికి షెడ్ల నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. 216 జాతీయ రహదారి నుంచి ఆయా ప్రాంతాలకు వెళ్లేందుకు అనుసంధాన మార్గాల నిర్మాణాలు జరుగుతున్నాయి.

పర్యటన ఇలా..

సీఎం పర్యటనకు సంబంధించి ఆదివారం అధికారులు విడుదల చేసిన వివరాలు ఇలా ఉన్నాయి.

- మంగళవారం ఉదయం 9.45 గంటలకు ఉండవల్లిలోని ఆయన నివాసం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరతారు.
- 10.30 - మొగల్తూరులో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు.
- 10.30 - 10.40 : వినతుల స్వీకరణ.
- 10.40 - 11.07 : మొగల్తూరు నుంచి ప్రత్యేక వాహనంలో నరసాపురం అంబేడ్కర్ కూడలికి చేరుకుంటారు. అక్కడి నుంచి స్టీమర్ రోడ్డు మీదుగా పొన్నపల్లి వస్తారు. అక్కడ లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ చేసి, వారితో ముచ్చటిస్తారు.



పడవలో ప్రయాణిస్తున్న కలెక్టర్ నాగరాణి, జేసీ కల్పశ్రీతదితరులు

- 11.45 : పొన్నపల్లి నుంచి గోదావరిలో బోటుపై వలందర రేవుకు.. అక్కడి నుంచి ప్రత్యేక వాహనంలో మొగల్తూరులోని వైజంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన ప్రజావేదికకు చేరుకుంటారు.
- 12.00 - 1.40 : ప్రజావేదిక వద్ద ప్రజలతో సమావేశం, స్టాళ్ల పరిశీలన
- మధ్యాహ్నం 1.40 - 2.50 : సీఎం ఆహారం తీసుకోవడం, వ్యక్తిగత పనులు.
- మధ్యాహ్నం 2.55 : ప్రజావేదిక వద్ద నుంచి బయలుదేరి కార్యకర్తల సమావేశ వేదిక వద్దకు చేరుకుంటారు.
- 2.55- 4.25 : సమావేశమై వారితో ఫొటోలు
- సాయంత్రం 4.25 - రోడ్డు మార్గంలో హెలిప్యాడ్‌కు చేరుకుంటారు.
- 4.30 గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి 5.20 గంటలకు ఉండవల్లిలోని నివాసానికి చేరుకుంటారు.



అభ్యర్థి హాల్ టికెట్ పరిశీలిస్తున్న ఎస్సై రెహమాన్, సిబ్బంది

నీట్ పీజీకి ఐదుగురు గైర్హాజరు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: భీమవరంలోని డీఎన్నార్ డిగ్రీ కళాశాల, ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల కేంద్రాల్లో ఆదివారం నీట్ పీజీ ప్రశాంతంగా జరిగింది. రెండు చోట్లా మొత్తం 280 మందికి గాను అయిదుగురు గైర్హాజరైనట్లు పర్యవేక్షకులు తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష జరిగింది. ఉదయం 7 గంటల నుంచే అభ్యర్థులు కేంద్రాలకు చేరుకున్నారు. పోలీసు, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది అభ్యర్థుల హాల్‌టికెట్లు, గుర్తింపు కార్డులను పరిశీలించి పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించారు.

సిబ్బంది లేరు.. అవినీతికి అడ్డేలేదు..

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో దుస్థితి

ఈనాడు డిజిటల్, భీమవరం: దిశా నిర్దేశం, పర్యవేక్షణ చేసే జిల్లా రిజిస్ట్రారు లేకపోవడం, సిబ్బంది కొరత ఆ శాఖ పనితీరుపై తీవ్ర ప్రభావాన్ని చూపుతోంది. నాలుగు నెలల కిందట నియమితులైన రిజిస్ట్రార్ రోజుల వ్యవధిలోనే సెలవు పెట్టడం, తర్వాత పదవీ విరమణ చేయడంతో మళ్లీ ఇన్‌ఛార్జుల పాలన నడుస్తోంది. జిల్లాల పునర్విభజన తర్వాత శాశ్వత పూర్తిస్థాయి అధికారి లేకపోవడం, దీర్ఘకాలం ఇన్‌ఛార్జుల పాలనలో నడుస్తుండటంతో ప్రజల, ప్రభుత్వ ఆస్తులకు నష్టం చేకూరుతుందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

క్యాడర్	ఉండాల్సింది	ఉన్నది
సబ్ రిజిస్ట్రార్	18	10
జూనియర్ అసిస్టెంట్లు	38	15
షరాబులు	10	1

కొరవడిన పర్యవేక్షణ..

జిల్లాలోని 15 సబ్ రిజిస్ట్రారు కార్యాలయాలు ఉండగా పూర్తిస్థాయిలో సిబ్బంది లేరు. పలు కార్యాలయాల్లో రెగ్యులర్ సబ్ రిజిస్ట్రార్లు లేక పక్క ప్రాంతాల అధికారులకు ఇన్‌ఛార్జ్ బాధ్యతలు అప్పగించారు. మొగల్తూరు, నరసాపురం, పాలకొల్లు, ఉండి, వీరవాసరం సబ్ రిజిస్ట్రారు కార్యాలయాలు ఇన్‌ఛార్జుల పాలనలోనే ఉన్నాయి. తాడేపల్లిగూడెం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో 8 మంది ఉద్యోగులు ఉండాల్సి ఉండగా నలుగురే ఉన్నారు. ప్రైవేటు వ్యక్తులు సుమారు ఏడుగురు పని చేస్తున్నారు. నరసాపురంలో జూనియర్ అసిస్టెంటు లేరు. భీమవరంలోనూ పూర్తిస్థాయిలో సిబ్బంది లేక సుమారు ఏడుగురు బయటవారు పనిచేస్తున్నారు. కీలకమైన పనులన్నీ వారే చూస్తుండటంతో కక్షిదారుల సేవలను బట్టి రూ.500 నుంచి 2వేల వరకు అదనంగా వసూలు చేస్తున్నారు.

తరచూ వివాదాలు

- యజమానికి సంబంధం లేకుండానే ఒకరి భూమిని మరొకరికి రిజిస్ట్రేషన్ చేశారనే ఫిర్యాదులతో గతంలో ఉండిలో అప్పటి సబ్ రిజిస్ట్రార్ సస్పెండ్ అయ్యారు. ఇటీవల తాడేపల్లిగూడెంలోనూ ఒకర్ని సస్పెండ్ చేశారు.
- కోర్టు అటాచ్‌మెంట్ ఆర్డర్ ద్వారా నిషేధిత జాబితాలో చేర్చిన ఆస్తిని నిబంధనలకు విరుద్ధంగా రిజిస్టర్ చేశారనే ఆరోపణపై భీమవరం రిజిస్ట్రార్ కార్యాలయ గత ఇన్‌ఛార్జి జాయింట్ సబ్ రిజిస్ట్రార్‌పై శాఖపరమైన విచారణ చేశారు.
- తణుకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో 2021లో ఇన్‌ఛార్జ్ సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేసిన వారిపై వివిధ ఆరోపణల నేపథ్యంలో శాఖపరమైన విచారణ చేశారు.

భారీగా వసూళ్లు..

ఆస్తుల నిర్ధారణ చేసి, దస్త్రాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసే సీనియర్, జూనియర్ అసిస్టెంట్ల కొరత వేధిస్తోంది. చాలాచోట్ల ప్రైవేటు వ్యక్తులే ఆ పనులు నిర్వహిస్తుండటంతో దస్త్రాలన్నీ సక్రమంగా ఉంటే రూ.5 వేలు లేకపోతే రూ.10వేల వరకు వసూళ్లకు పాల్పడుతున్నారు. స్టాంప్ అమ్మకాలను నాన్ జ్యుడిషియల్, స్పెషల్ అడిసెవ్, కోర్టు ఫీజు, నోటరీ స్టాంపులు తదితర సేవలు షరాబు చేయాలి. జిల్లాలో పది మంది ఉండాల్సి ఉండగా కేవలం ఒక్కరే ఉన్నారు. ఈసీలు, నకళ్లు, మార్కెట్ విలువ ధ్రువీకరణ పత్రాలు, తదితర పనులు చూసే కార్యాలయ సబార్డినేట్లు 20 మందికి నలుగురే ఉన్నారు.

జిల్లాకు 50 విద్యుత్తు బస్సులు

- ప్రయాణికులకు మెరుగైన సేవలే లక్ష్యం
- జిల్లా ప్రజా రవాణాధికారి వెల్లడి

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఆర్టీసీ ప్రయాణికులకు మరింత మెరుగ్గా సేవలందించేలా చర్యలు చేపట్టినట్లు జిల్లా ప్రజా రవాణాధికారి గిరిధర్‌కుమార్ తెలిపారు. పలు అంశాలపై ఆయన 'న్యూస్‌టుడే'తో మాట్లాడారు. త్వరలోనే జిల్లాకు విద్యుత్తు బస్సులు రానున్నాయని పేర్కొన్నారు. తొలి దశలో జిల్లా కేంద్రానికి 50 బస్సులు మంజూరయ్యాయని, అవి వచ్చే ఏడాది జనవరి నుంచి ప్రజలకు అందుబాటులోకి వస్తాయని తెలిపారు.



ఈనాడు మీతో ఉు

గిరిధర్ కుమార్

- గతంలో జిల్లాలో 24 బడి బస్సులు రోజుకు వంద కి.మీ. మాత్రమే తిరిగేవి. రీషెడ్యూలు చేయడంతో ఇప్పుడు 350 కి.మీ. తిరుగుతున్నాయి. గతం కంటే అదనంగా నెలకు 6 వేల కి.మీ. మేర ఈ బస్సులు నడుస్తున్నాయి.
- జిల్లాలో స్త్రీశక్తి పథకాన్ని ఇప్పటి వరకు 3.19 కోట్ల మంది ఉపయోగించుకున్నారు. దివ్యాంగశక్తి పథకాన్ని కూడా సద్వినియోగం చేసుకుంటున్నారు. బస్సుల సామర్థ్యం పెంచాం. మెకానికల్ నుంచి అన్ని విభాగాల్లో నిబంధనల ప్రకారం పొరుగు సేవల సిబ్బందిని నియమించి ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరిస్తున్నాం.
- గతంలో సంస్థ ప్రధాన కార్యాలయం నుంచి విడిభాగాలు రావడానికి సమయం పట్టేది. దీంతో వెంటనే మరమ్మతులు చేసే అవకాశం ఉండేది కాదు. ఇప్పుడు డిపో, జిల్లా స్థాయిలోనే పరికరాలు, విడిభాగాలు కొనుగోలు చేసే అవకాశం కల్పించారు. దీంతో బస్సుల మరమ్మతులు వేగంగా పూర్తవుతున్నాయి.
- సంస్థ ఆస్తులను లీజుకు ఇవ్వడం ద్వారా ఆదాయం పెంచేందుకు కృషి చేస్తున్నాం. తాడేపల్లిగూడెంలో 634 చదరపు గజాల స్థలాన్ని 15 ఏళ్లకు లీజుకిచ్చాం. దీని ద్వారా నెలకు రూ.3.27 లక్షల ఆదాయం సమకూరనుంది. భీమవరం బస్‌స్టాండ్ వెలుపల దుకాణాల ద్వారా ఆదాయం వస్తోంది. ఉండిలో స్థలాన్ని క్రీడల నిర్వహణకు లీజుకివ్వడం ద్వారా ఆదాయం సమకూరుతోంది. నరసాపురం, పాలకొల్లులో ఈ దిశగా ప్రయత్నాలు చేస్తున్నాం.

చుట్టూ తిరిగి వెళ్లలేం.. పంటుతో పాట్లు పడలేం



బల్లకట్టు లాగేందుకు అవస్థలు పడుతున్న కాలనీవాసులు

పెంటపాడు మండలం రావిపాడులోని పేదల కాలనీ వెంకయ్యకాలువ పక్కనే ఉంది. 120 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు కేటాయించినా సరైన రహదారి, పంట కాలువపై వంతెన లేకపోవడంతో 20 మంది మాత్రమే ఇళ్లను నిర్మించుకొని నివాసముంటున్నారు. సౌకర్యాలు కల్పించాలని అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదని, తాత్కాలికంగా బల్లకట్టును మాత్రమే ఏర్పాటు చేశారన్నారు. అది కూడా నలుగురు పట్టుకొని లాగినా కదలడం లేదన్నారు. ప్రత్యామ్నాయంగా జాతీయ రహదారి మీదుగా చుట్టూ తిరిగి అయిదు కిలోమీటర్ల మేర ఉన్న బురద రోడ్డులో ప్రయాణించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అధికారులు పరిశీలించి దగ్గర దారిగా ఉన్న పంట కాలువపై వంతెన నిర్మించాలని వారంతా కోరుతున్నారు. - ఈనాడు, పెంటపాడు



బురదతో అధ్వానంగా ఇలా..

ప్రయాణం.. కారాదు ప్రమాదం 6లో

ఉమ్మడి జిల్లాలో పెరుగుతున్న ఘటనలు

మార్పులు, చేర్పులకు 4,748 దరఖాస్తులు

ఈనాడు డిజిటల్, భీమవరం: ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియలో భాగంగా మ్యాపింగ్ కాని వివరాల్లో తప్పులున్న, అనుమానాస్పదంగా ఉన్న ఓటర్లకు నోటీసులు జారీ చేస్తూనే కొత్త ఓటర్ల చేర్పులు, తప్పుల సవరణ, మార్పుల కోసం ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఏడు నియోజకవర్గాల్లో 1462 పోలింగ్ కేంద్రాల పరిధిలో ఈ నెల 22, 23 తేదీల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహించి, ఓటర్ల పరిశీలనార్థం జాబితాలు అందుబాటులో ఉంచారు. బూత్‌స్థాయి అధికారులు హాజరై కొత్తగా ఓటు నమోదుకు (ఫారం 6), జాబితా నుంచి పేర్ల తొలగింపు, అభ్యంతరాలకు సంబంధించి (ఫారం 7), మార్పులు, చేర్పులు, ఓటు బదిలీకి (ఫారం 8) మొత్తం 4,748 దరఖాస్తులు స్వీకరించారు.

నియోజకవర్గం	ఫారం 6	ఫారం 7	ఫారం 8
ఆచంట	226	8	122
పాలకొల్లు	450	16	243
నరసాపురం	394	28	229
భీమవరం	371	34	316
ఉండి	532	25	253
తణుకు	506	36	297
తాడేపల్లిగూడెం	407	34	221

తుడిచిపెట్టేస్తున్న తెల్లమచ్చ

65 శాతం విస్తీర్ణంలో రొయ్యల చెరువులు ఖాళీ

ఉండి, న్యూస్‌టుడే: విభిన్న వాతావరణ పరిస్థితులు, వ్యాధుల వ్యాప్తి ఉభయ జిల్లాల్లో రొయ్యల సాగుపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. నాలుగు నెలల కిందటి వరకు వైట్‌గట్, ఈహెచ్‌పీ, ఇప్పుడు తెల్లమచ్చల(వైట్ స్పాట్) వ్యాధి రొయ్యల చెరువులను తుడిచి పెట్టేస్తున్నాయి. ఉభయ జిల్లాల్లో ఇప్పటికే 65 శాతం విస్తీర్ణంలో పంట దెబ్బతింది. గత ఆరు నెలల వ్యవధిలో సాగుదారులు రూ.1,300 కోట్లకు పైగా నష్టపోయారంటే పరిస్థితి ఏ స్థాయికి చేరిందో స్పష్టమవుతోంది. నాణ్యత లేని సీడ్ వినియోగమే దీనికి ప్రధాన కారణమని ఆక్వా రంగ నిపుణులు చెబుతున్నారు.



ఉండిలో రొయ్యల పట్టుబడి

ఏడెనిమిది సార్లు సీడ్ సేకరణ.. సముద్రం నుంచి సేకరించిన నాణ్యమైన బ్రూడ్ స్టాక్ (తల్లి రొయ్య) నుంచి రెండు పర్యాయాలు విత్తనాన్ని సేకరిస్తే నాణ్యత బాగుంటుంది. ఇలాంటి సీడ్‌కు వ్యాధులు సోకే అవకాశం తక్కువ. కానీ ఒకే తల్లి రొయ్య నుంచి ఏడెనిమిది సార్లు సీడ్ ఉత్పత్తి చేసి రైతులకు విక్రయిస్తున్నాయి. వీటిని రైతులు కొని చెరువుల్లో వేస్తుండగా రోజుల వ్యవధిలోనే రొయ్యలు వైరస్, బ్యాక్టీరియా వ్యాధులకు గురవుతున్నాయి. మరో పక్క మేతల్లో వినియోగించే ఫిష్‌మీల్, సోయా, మినరల్స్, విటమిన్స్, ప్రో బయోటిక్స్, ఫిష్ ఆయిల్ నాణ్యతపై సందేహాలు ఉన్నాయి.

ముందస్తు జాగ్రత్తలతో నివారణ.. రొయ్యల సాగులో చెరువు తయారీ నుంచి ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరి. తొలుత రిజర్వాయర్‌లోకి నీరు తోడి బ్లీచింగ్, శానిటైజర్స్‌తో శుద్ధి చేసిన తరువాతే చెరువులో నింపాలి. వైట్ స్పాట్ నివారణకు మందుల్లేవు. నాణ్యమైన సీడ్ సేకరించుకొంటే ఈ వ్యాధిని నివారించుకోవచ్చు. ఎకరానికి 60 వేల నుంచి 70 వేల మధ్య రొయ్య పిల్లలు వదులుకోవాలి. వాతావరణ పరిస్థితుల ఆధారంగా నిపుణుల సూచనలు పాటించాలి. చెరువు నీటిలో ఆక్సిజన్ లోటు రాకుండా అవసరమైనన్ని ఏరియేటర్లు వినియోగించాలి.

- వీరభద్రరావు, శ్రీనివాసరావు, మత్స్య శాస్త్రవేత్తలు

ఉభయ జిల్లాల్లో చెరువుల విస్తీర్ణం (లక్షల ఎకరాలు) ఇలా..


ఆక్వా	రొయ్య	చేప
2.90	1.20	1.70

వార్షిక ఉత్పత్తి: 4 లక్షల టన్నులు

టర్నోవర్: రూ.18 వేల కోట్లు

సీజన్‌కు సీడ్ ఖర్చు: రూ.420 కోట్లు

తమ్మిలేరు..జాగ్రత్త అటువైపు వెళ్లేరు



తమ్మిలేరు జలాశయం లాకుల వద్ద భయానక పరిస్థితి నెలకొంది. లాకులకు ఇరువైపులా నిర్మించిన రక్షణ కట్టడాలు శిథిలమయ్యాయి. సిమెంటు లేచిపోయి ఇనుప చువ్వలు బయట పడ్డాయి. ఇక్కడ ఎలాంటి మరమ్మతులు చేయకపోవడంతో ఏ క్షణంలోనైనా కూలిపోయే ప్రమాదం పొంచి ఉంది. లాకులపై నుంచి దిగువకు చూస్తూ ఆనందంగా వీక్షిస్తుంటారు. వరుసగా సెలవులొస్తే లాకుల వద్ద సందర్శకుల తాకిడి కనిపిస్తోంది. - న్యూస్‌టుడే, చాట్రాయి

ప్రయాణం.. కారాదు ప్రమాదం..

ఉమ్మడి జిల్లాలో పెరుగుతున్న ఘటనలు

✳ జంగారెడ్డిగూడెం మండలం లక్కవరం గ్రామానికి చెందిన ఆరుగొల్లు కల్యాణ్ (26), అతడి మిత్రుడు పండు కలిసి ద్విచక్ర వాహనంపై ఈ నెల 25న జి.కొత్తపల్లి వెళ్తుండగా మార్గం మధ్యలో ఎదురుగా వచ్చిన వ్యాన్ ఢీకొట్టింది. ఈ ఘటనలో కల్యాణ్ మృతి చెందగా.. మరో యువకుడు ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. కల్యాణ్‌కు భార్య, ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు. ప్రస్తుతం వారి కుటుంబ పరిస్థితి దయనీయంగా మారింది.

✳ జంగారెడ్డిగూడెం మండలానికి చెందిన కె.సాయి మరొక స్నేహితుడితో కలిసి కొద్దినెలల కిందట గ్రీన్ ఫీల్డ్‌పై వస్తుండగా.. ద్విచక్ర వాహనం అదుపు తప్పి పక్కనే ఉన్న డివైడర్‌ను ఢీకొట్టారు. ఇద్దరూ శిరస్త్రాణాలు ధరించకపోవడంతో తలకు బలమైన గాయాలై ఘటనాస్థలిలోనే మృతిచెందారు. రెండు కుటుంబాల సభ్యులు తీవ్ర ఇబ్బందులు చవిచూస్తున్నారు.

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే

రహదారులపై సాఫీగా సాగాల్సిన ప్రయాణాలు వివిధ కారణాలతో ప్రమాదాలుగా మారుతున్నాయి. ఇంటి నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి తిరిగి వచ్చే వరకు కుటుంబ సభ్యులు ఎదురు చూడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో నిత్యం ఏదోమూల రోడ్డు ప్రమాదాలు జరగడమే ఇందుకు నిదర్శనం. ఆయా ప్రమాదాల్లో కొందరి ప్రాణాలు గాల్లో కలిసిపోతుంటే.. మరికొందరు తీవ్ర గాయాలపాలై మంచానికే పరిమితమవుతున్నారు. గతంతో పోలిస్తే ప్రమాదాల సంఖ్య కూడా పెరిగింది.



దేవరపల్లి- తల్లాడ జాతీయ రహదారిపై డ్రమ్ములు ఏర్పాటు చేస్తున్న పోలీసులు

కుటుంబాలు ఛిన్నాభిన్నం..

మితిమీరిన వేగంతో కొందరు, మద్యం, మాదకద్రవ్యాల మత్తులో మరికొందరు వాహనాలు నడుపుతూ.. ప్రమాదాలు సృష్టిస్తూ ఇతర ప్రయాణికుల జీవితాలను చిదిమేస్తున్నారు. చోదకుల నిర్లక్ష్యం, అవగాహన రాహిత్యంతోపాటు స్వయంకృతాపరాధాలతో చేస్తున్న తప్పులకు మరొకరు బలవుతున్నారు. వీటి వల్ల చిన్న, మధ్య తరగత కుటుంబాలు ఛిన్నాభిన్నమవుతున్నాయి. కుటుంబానికి ఆసరాగా నిలిచిన వ్యక్తిని మృత్యువు కబళిస్తే ఆ కుటుంబం కోలుకోలేని స్థితికి చేరుతుంది.

నియంత్రణకు చర్యలు



'జంగారెడ్డిగూడెం సబ్ డివిజన్ పరిధిలోని బ్లాక్ స్పాట్‌ల వద్ద బారికేడ్లు, డ్రమ్ములు, సూచికలు ఏర్పాటు చేస్తున్నాం. మద్యం తాగి నిర్లక్ష్యంగా వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. జాతీయ రహదారులపై కూడళ్ల, రద్దీ మార్గాల్లో ఇరువైపులా వాహనాలు నిలుపుదల చేయకుండా చర్యలు తీసుకోవడంతోపాటు ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం' అని డీఎస్పీ బీహెచ్.వెంకటేశ్వర్లు తెలిపారు.

ఉమ్మడి జిల్లాలో మూడేళ్లుగా రోడ్డు ప్రమాదాల వివరాలు

సంవత్సరం	ప్రమాదాలు	మృతులు	క్షతగాత్రులు
2024	330	153	278
2025	360	170	305
2026	189	81	193

(జులై వరకు)

దివ్యాంగ చిన్నారులకు నిరామయ భరోసా

రూ.లక్ష వరకు ఆరోగ్య బీమా వర్తింపు

పాలకోడేరు, వాసవీ పెనుగొండ, న్యూస్‌టుడే: దివ్యాంగులు, ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లల ఆరోగ్య పరిరక్షణకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కొన్ని కేటగిరీల వైకల్యాలు, అనారోగ్య సమస్యలతో సతమతమయ్యే వారికి 'నిరామయ ఆరోగ్య బీమా' పథకంతో భరోసా కల్పిస్తోంది. అర్హులు ఏడాదికి రూ. లక్ష వరకు బీమా రూపంలో పొందవచ్చు. దీనికి 'నిరామయ' పోర్టల్ ద్వారా దరఖాస్తు చేయవచ్చు.

అర్హులు ఎవరంటే..

కేంద్ర సామాజిక న్యాయ, సాధికారత మంత్రిత్వ శాఖ పరిధిలో 'ది నేషనల్ ట్రస్ట్' ద్వారా ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోంది. ఆటిజం, బుద్ధి మాంద్యం, సెరిబ్రల్ పాల్సీ, బహుళ వైకల్యాలు ఉనన వారంతా ఈ పథకానికి అర్హులు. దరఖాస్తుకు యూడీఐడీతో పాటు రేషన్ కార్డు, ఆదాయ ధ్రువపత్రం, బ్యాంకు ఖాతా, ఆధార్ నకళ్లు జత చేయాల్సి ఉంటుంది.

రిజిస్ట్రేషన్ ఇలా..

ది నేషనల్ ట్రస్ట్ వెబ్‌సైట్‌లో 'నిరామయ హెల్త్ ఇన్సూరెన్స్' ఆప్షన్‌పై క్లిక్ చేయగానే రిజిస్ట్రేషన్ పేజీ కనిపిస్తుంది. ముందుగా యూడీఐడీ నంబరు, పుట్టిన తేదీ వివరాలు నమోదు చేసి వేలిడేట్ ఆప్షన్‌పై క్లిక్ చేయగానే విద్యార్థి వివరాలు కనిపిస్తాయి. ఏమైనా మార్పులు ఉండే సరిచేసుకోవచ్చు. చిరునామా, బ్యాంకు ఖాతా వివరాలు నమోదు చేసి చివరిలో రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించి సబ్‌మిట్ చేయాలి. ఈ- ఇన్సూరెన్స్ కార్డు నేరుగా వాట్సాప్‌కు వస్తుంది.

జిల్లాలో ఇలా...

జిల్లాలో 19 భవిత కేంద్రాలు ఉండగా ప్రత్యేక అవసరాలు ఉనన పిల్లలు 2,363 మంది వరకు ఉన్నారు. వీరిలో బీమాకు అర్హులైన వారు 700 మంది వరకు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వారి వివరాలను ఐఈఆర్‌టీ సిబ్బంది బీమా పోర్టల్‌లో నమోదు చేసే ప్రక్రియ చేపట్టారు. కేంద్రాల పరిధిలో లేని దివ్యాంగ చిన్నారులు పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని ఐఈఆర్‌సీ జిల్లా సమన్వయకర్త శ్రీనివాస్ తెలిపారు.

బాస్కెట్‌బాల్.. కొలువే గోల్!

జాతీయ స్థాయి పతకాలే లక్ష్యంగా ముందుకు

ఏలూరు నగరం, పెదవేగి- న్యూస్‌టుడే: సంకల్పం ఉండాలే గానీ.. లక్ష్య సాధనకు పేదరికం, ఆర్థిక పరిస్థితులు అడ్డంకి కాదని నిరూపిస్తున్నారా యువతులు. పాఠశాల స్థాయిలోనే బాస్కెట్‌బాల్ క్రీడపై ఆసక్తి పెంచుకొని.. జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణిస్తున్నారు. శిక్షకుడు కె.మురళీకృష్ణ ప్రోత్సాహం, కుటుంబ సభ్యుల సహకారంతో కఠోర సాధన చేస్తూ.. రోజురోజుకూ రాటుదేలుతున్నారు. తాజాగా తిరుపతి వేదికగా నిర్వహించిన అమరావతి ఛాంపియన్‌షిప్-2026లో అండర్-23 మహిళా బాస్కెట్‌బాల్ ఛాంపియన్లుగా నిలిచిన ఏలూరు క్రీడాకారిణులపై కథనం.

స్వర్ణం సాధించా..



నా పేరు బాడిత దేవిశ్రీ. డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతున్నా. నాన్న దుర్గాప్రసాద్ ముఠా కార్మికుడు. అమ్మ కుమారి గృహిణి. ఎనిమిదో తరగతి నుంచే బాస్కెట్‌బాల్ ఆడుతున్నా. రెండేళ్ల కిందట రాష్ట్రస్థాయి పోటీల్లో స్వర్ణం సాధించా. రాజస్థాన్‌లో నిర్వహించిన అండర్-19 జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని త్రుటిలో పతకం కోల్పోయా. భవిష్యత్తులో జాతీయ స్థాయిలో పతకాలు కైవసం చేసుకొని.. బ్యాంకింగ్ రంగంలో కొలువు సాధిస్తా.

అద్భుత ప్రదర్శనతో..



నా పేరు ద్వారపురెడ్డి సాయి భవాని. డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతున్నా. నాన్న సత్యనారాయణ కూలి. అమ్మ లత టైలరింగ్ చేస్తారు. విశాఖపట్నంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో అద్భుత ప్రదర్శనతో స్వర్ణం సాధించా. పంజాబ్, పుదుచ్చేరి, రాజస్థాన్‌లలో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించా. తాజాగా అమరావతి ఛాంపియన్‌షిప్-2026 విజేతగా నిలవడం మరువలేని అనుభూతి. భవిష్యత్తులో క్రీడా కోటాలో ప్రభుత్వ కొలువు సాధించడమే లక్ష్యం.

రైల్వే ఉద్యోగమే..



నా పేరు నందపు రేణుక దేవి. డిగ్రీ ప్రథమ సంవత్సరం అభ్యసిస్తున్నా. నాన్న రమణబాబు పచారీ కొట్టులో పని చేస్తారు. అమ్మ నాగమణి గృహిణి. ఏడో తరగతి నుంచే బాస్కెట్‌బాల్ ఆడుతున్నా. వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో రజత, కాంస్య పతకాలు సాధించా. జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు సాధించడమే ధ్యేయంగా సాధన చేస్తున్నా. క్రీడా కోటాలో రైల్వే ఉద్యోగం సాధించడమే నా ఆశయం.

మన్యంలోకి రాజమార్గం

రెండో ప్యాకేజీ పనులకు రూ.840 కోట్లు మంజూరు

కొయ్యలగూడెం గ్రామీణ, పోలవరం, న్యూస్‌టుడే: జీలుగుమిల్లి- పోలవరం- కొవ్వూరు రెండు లైన్ల జాతీయ రహదారి 365 బీబీ పనులు మరింత వేగవంతం కానున్నాయి. ఇందుకోసం కేంద్రం రూ.840 కోట్లు మంజూరు చేసినట్లు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఇటీవల ప్రకటించడం తెలిసిందే. రెండు ప్యాకేజీలుగా నిర్దేశించిన పనుల్లో మొదటిది జీలుగుమిల్లి నుంచి బుట్టాయగూడెం, ఎల్ఎన్‌డీపేట నుంచి పట్టిసీమ వరకు సుమారు 40.4 కి.మీ. పొడవున చేపట్టిన పనుల్లో దాదాపు 50 శాతం పూర్తయ్యాయి. రానున్న అక్టోబరు నాటికి తొలి ప్యాకేజీ పనులు పూర్తి చేయాలన్న లక్ష్యంతో అధికారులు ఉన్నారు. రెండో ప్యాకేజీ కింద బుట్టాయగూడెం నుంచి ఎల్ఎన్‌డీపేట, పట్టిసీమ నుంచి కొవ్వూరు వరకు 46.3 కి.మీ. పొడవున రహదారి నిర్మాణానికి 115 హెక్టార్ల భూమిని సేకరిస్తారు. ఇందుకు రూ. 90 కోట్లు వెచ్చించనున్నారు. రానున్న పుష్కరాల నాటికి పనులను కొలిక్కి తీసుకురావాలన్న లక్ష్యంతో యంత్రాంగం ఉన్నట్లు తెలుస్తోంది.



వెంకటాపురం, కన్నాపురం కూడలి మధ్య పనుల తీరు



రహదారి పనులు మొదలయ్యే ప్రాంతం

పర్యాటక హబ్‌కు దోహదం.. పోలవరం ప్రాంతాన్ని పర్యాటక హబ్‌గా అభివృద్ధి చేయనున్నట్లు కూటమి ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో 365బీబీ రహదారితో కొంత ప్రయోజనం చేకూరనుంది. ఏజెన్సీవాసులు, ప్రాజెక్టు నిర్వాసితులు ఐటీడీఏకు వెళ్లేందుకు అనువైన మార్గం అవుతుంది. పోలవరం, కన్నాపురం, బుట్టాయగూడెం ప్రాంతవాసులకు హైదరాబాదుకు రాకపోకలు మరింత సులభతరమవుతాయి. ప్రాజెక్టును చూడాలని వచ్చే తెలంగాణ వాసులు, కొవ్వూరు వైపు నుంచి వచ్చే సందర్శకులకు దగ్గర దారి అవుతుంది. ముఖ్యంగా జీలుగుమిల్లి నుంచి బుట్టాయగూడెం, కన్నాపురం, పోలవరం మధ్య ప్రాంతాల అభివృద్ధికి దోహదం కానుంది.

భూసేకరణ ప్రక్రియే కీలకం.. రెండో ప్యాకేజీలో ఏటిగట్టు పొడవునా కొత్త రహదారి నిర్మాణానికి అవసరమైన భూమి సేకరించాల్సి ఉంది. మరోవైపు అదే మార్గం వెంబడి డ్రెయిన్ నిర్మించనున్నారు. పట్టిసీమ నుంచి కొవ్వూరు పనులకు ప్రభుత్వ భూమి తక్కువగా ఉండటం అధికారులకు సవాల్ కావచ్చు. బుట్టాయగూడెం-ఎల్ఎన్‌డీపేటల మధ్య కొంతమేర ప్రభుత్వ భూమి ఉండటంతో ఆ ప్రాంతంలో పనులకు జాప్యం ఉండకపోవచ్చు. రెండో ప్యాకేజీ పనుల కోసం ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు అందాల్సి ఉందని ఎన్‌హెచ్ డీఈ శ్రీనివాస్ అన్నారు. ఎల్ఎన్‌డీపేట నుంచి పట్టిసీమ మధ్య పనులను వేగవంతం అయ్యేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

మహోన్నత వ్యక్తిత్వం కృష్ణబాబు సొంతం

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: మచ్చలేని మహోన్నత వ్యక్తిత్వం కృష్ణబాబు సొంతమని శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు నియోజకవర్గ కృష్ణబాబు అభిమాన సంఘం ఆధ్వర్యంలో గామన్ వంతెన కూడలిలో ఏర్పాటు చేసిన మాజీ ఎమ్మెల్యే పెండ్యాల వెంకటకృష్ణారావు (కృష్ణబాబు) విగ్రహాన్ని ఆయన ఆదివారం ఆవిష్కరించారు. దొమ్మేరులో బస్ స్టాండ్ వద్ద ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆంధ్రా సుగర్స్ సీఎండీ పెండ్యాల నరేంద్రనాథ్‌చౌదరి, కృష్ణబాబు విగ్రహాన్ని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆవిష్కరించారు. కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన సంస్మరణ సభలో 'జమిందారు నుంచి జనం మనిషిగా ఎదిగిన ప్రజానేత' పేరిట ముద్రించిన పుస్తకాన్ని అతిథులు ఆవిష్కరించారు. ఉప సభాపతి రఘురామకృష్ణరాజు మాట్లాడుతూ మంచి, మానవత్వానికి కృష్ణబాబు ప్రతిరూపమన్నారు. ఎమ్మెల్యేలు ఆరిమిల్లి రాధాకృష్ణ, చింతమనేని ప్రభాకర్, కాపు కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, మాజీ మంత్రి పీతల సుజాత, శాసనమండలి మాజీ ఛైర్మన్ షరీఫ్, కృష్ణబాబు కుటుంబ సభ్యులు, పారిశ్రామికవేత్తలు, ప్రముఖులు పాల్గొన్నారు.



విగ్రహాన్ని ఆవిష్కరించిన స్పీకర్ అయ్యన్న పాత్రుడు. చిత్రంలో అచ్చిబాబు, తుమ్మల నాగేశ్వరరావు, కందుల దుర్గేశ్, రఘురామ కృష్ణరాజు, కామినేని శ్రీనివాస్ తదితరులు

విద్యాశాఖాధికారి సరెండర్?

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: జిల్లా విద్యాశాఖలో ఓ అధికారిని ఆ శాఖ రాష్ట్ర కార్యాలయానికి సరెండర్ చేసినట్లు తెలిసింది. గతంలో ఆయన కీలక హోదాలో పనిచేసిన సమయంలో వచ్చిన ఆరోపణలపై విచారణ నిమిత్తం ఈ చర్య తీసుకున్నట్లు సమాచారం. దీనిపై కొద్ది రోజుల కిందటే అధికారిక ఉత్తర్వులు వెలువడినా గోప్యంగా ఉంచినట్లు తెలిసింది.



గుబ్బల మంగమ్మ గుడికి భక్తుల తాకిడి

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: బుట్టాయగూడెం మండలం కామవరం అడవిలోని గుబ్బల మంగమ్మ గుడికి ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల నుంచి ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఉదయం నుంచి అమ్మవారిని దర్శించుకుని నైవేద్యాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అడవిలోని వృక్షాల కింద వంటలు వండుకుని సహపంక్తి భోజనాలు చేశారు.

ఆసనం.. ఆరోగ్య జీవన సోపానం

నిత్య సాధనతో పోటీల్లో రాణిస్తున్న మహిళలు

ఆగిరిపల్లి, నూజివీడు, న్యూస్‌టుడే: ప్రస్తుతం చిన్నారుల నుంచి పెద్దల వరకు తమ దైనందిన జీవితంలో ఒత్తిడికి గురవుతున్నారు. చాలా మంది అనారోగ్య సమస్యల బారిన పడుతున్నారు. ఇంటి బాధ్యతలు, పిల్లలు, ఉద్యోగంతో మహిళలకు ఎక్కువ మంది ఒత్తిడికి లోనవుతూ, అనారోగ్యంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్య నివారణ యోగాభ్యాసంతోనే సాధ్యమని పలువురు మహిళలు చెబుతున్నారు. కొందరు నిత్య సాధన చేస్తూ, పోటీల్లోనూ రాణిస్తున్నారు.

యోగాపై పట్టు సాధించి..



నా పేరు బి.పద్మ శ్రీలత. నేను యోగాపై పట్టు సాధించి రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో రెండో బహుమతి పొందాను. చిన్నారులకు యోగా ఉచిత శిక్షణ ఇస్తూ.. మంచి ఆరోగ్యానికి బాటలు వేస్తున్నా. ఆరోగ్య పరిరక్షణకు యోగా అవసరం ఎంతో తెలియజెబుతూ ప్రజలకు యోగాపై ఆసక్తిని కలిగిస్తున్నా. సమాజానికి మేలు చేకూర్చే లఘు నాటిక రచనలు చేస్తున్నా. చిన్నారులతో నాటక ప్రదర్శనలు చేయిస్తూ.. ప్రజల్లో అనేక అంశాలపై అవగాహన, చైతన్యం కలిగించే దిశగా కృషి చేస్తున్నా.

ఒత్తిడి లేని జీవితం...



నా పేరు సగ్గుర్తి కమల. నేను ప్రతిరోజు నడకతో పాటు యోగాసనాలు సాధన చేస్తున్నాను. యోగా వల్ల ప్రయోజనాలు తెలుసుకుని అందిరికీ అవగాహన కలిగిస్తున్నా. యోగా సాధనతో ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా జీవిస్తున్నాం. రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో ద్వితీయ స్థానం సాధించా. అనేక మందికి యోగా వల్ల కలిగే ప్రయోజనాలు వివరిస్తున్నా.

ఎన్నో ప్రయోజనాలు..



నా పేరు జ్యోతి కుమారి. నేను యోగా టీచర్‌గా పనిచేస్తున్నా. వయసుతో సంబంధం లేకుండా అందరూ యోగా సాధన చేయాలి. నిత్యం యోగా చేస్తే... రోజువారీ కార్యక్రమాలు, విధుల్లో ఏకాగ్రత, చురుకుదనంతో పనిచేస్తారు. రక్త ప్రసరణ క్రమబద్ధం అవుతుంది. ఎలాంటి జబ్బులు దరిచేరవు. ఇది అందరికి ఉపయోగం. రాష్ట్ర స్థాయిలో పతకాలు సాధించా.



ప్రారంభోత్సవంలో శ్రీనివాస వర్మ, ఎమ్మెల్యేలు పితాని, ఆరిమిల్లి తదితరులు

తిరుమల తరహాలో వాడపల్లి క్షేత్రం అభివృద్ధి

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని తిరుమల తరహాలో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. ఆదివారం వాడపల్లి ఆలయ ప్రాంగణంలో శ్రీవకుళమాత అన్నదాన భవన ప్రారంభోత్సవానికి వచ్చిన ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ ప్రసాద్ నిధులు మంజూరుకు కృషి చేస్తామన్నారు. నూతన అన్నదాన భవనంలో ఒకేసారి 3వేల మందికి భోజనాలు, ఆధునిక పరికరాలతో రోజుకు సుమారు 40 వేల మందికి ప్రసాదం సిద్ధం చేసేలా సౌకర్యాలు కల్పించడం అభినందనీయమన్నారు. సభాధ్యక్షుడు, ఎమ్మెల్యే బండారు మాట్లాడుతూ.. ఆలయానికి సునాయాసంగా చేరుకునేందుకు రూ.8 కోట్లతో రావులపాలెం నుంచి ఏటిగట్టు రహదారి అభివృద్ధి చేయనున్నామని, ఇందుకు ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రూ.6 కోట్లు నిధులు అందజేశారన్నారు. అన్నదాన భవనానికి పశ్చిమగోదావరి జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రూ.1.50 కోట్లు ఇచ్చారని, భవిష్యత్తులో మరో రూ.50 లక్షలు అందించేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. తణుకు, ఆచంట ఎమ్మెల్యేలు ఆరిమిల్లి రాధాకష్ణ, పితాని సత్యనారాయణ, పశ్చిమగోదావరి జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీరామరాజు తదితరులు పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర

★ For the Information of Trade & Industry
★ గోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గ్రుడ్డు ధర రూ. 5.55 పై॥
తణుకు ఆఫీసు: 08819-224254

ఇక బడిలోనే చికిత్స

ముదినేపల్లి, ఉంగుటూరు, న్యూస్‌టుడే: పీఎంశ్రీ పాఠశాలల్లో పిల్లల ఆరోగ్యానికి మరింత భద్రత లభించనుంది. పాఠశాలలో ఉన్న సమయంలో ఏ విద్యార్థికైనా చిన్న ఆరోగ్య సమస్య వచ్చినా వెంటనే చికిత, సపర్యలకు సౌకర్యాలు సమకూరనున్నాయి. వీరి ఆరోగ్య పరిరక్షణకు కూటమి ప్రభుత్వం 'సిక్ రూమ్'లు సమకూర్చేందుకు చర్యలు తీసుకుంది. ఒక్కో బడికి దీని నిమిత్తం రూ.5 లక్షల వరకు ప్రభుత్వం ఖర్చు చేస్తోంది.



ముదినేపల్లి పీఎంశ్రీ పాఠశాలకు వచ్చిన పరికరాలు

సిక్ రూమ్‌ల ఏర్పాటు.. బడుల్లో ఎంపిక చేసిన గదిలో సిక్ రూమ్‌కు అవసరమైన అన్నింటినీ సమకూర్చనున్నారు. బాలబాలికలకు విడివిడిగా చికిత్సలు అందించనున్నారు. పరుపుతో కూడిన మంచం, కుర్చీలు, శానిటైజర్ డిస్పెన్సరీ, వాషింగ్ స్టేషన్ వంటి పరికరాలు ఇప్పటికే పాఠశాలలకు చేరాయి. వీటితోపాటు ఏడాదికి సరిపడే మందులతో ప్రథమ చికిత్స కిట్ అందుబాటులో ఉంచుతారు. రక్తపోటు, మధుమేహం పరీక్షలకు తోడు బరువు తూచే పరికరాలతో పలు రకాల సామగ్రితో ఈ సిక్ రూమ్ అన్ని వేళలా అందుబాటులో ఉంటుంది. ఆరోగ్య సిబ్బందితో కలిసి పిల్లలకు ప్రాథమిక చికిత్స అందించడం కోసం త్వరలో సైన్స్ ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వనున్నారు.



బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా)
(కిలో 1 కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -120 రిటైల్ ధర 147 చికెన్ విత్ స్కిన్ - 228 చికెన్ స్కిన్‌లెస్ - 257.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 130, 139, 150 చికెన్ విత్ స్కిన్ - 250 చికెన్ స్కిన్‌లెస్ - 260.

కుడి కాలువలోకి 32 టీఎంసీలు

పోలవరం, న్యూస్‌టుడే: పట్టిసీమ ఎత్తిపోతల పథకం ద్వారా ఇప్పటి వరకు 32 టీఎంసీలు కుడి కాలువలోకి తరలించినట్లు పర్యవేక్షణ డీఈ సురేశ్‌బాబు తెలిపారు. ఎత్తిపోతల పథకంలోని 22 పంపుల నుంచి 7,788 క్యూసెక్కులు డెలివరీ సిస్టమ్ నుంచి కుడికాలువలోకి వెళ్తోందన్నారు.

నేడు పీజీఆర్ఎస్ రద్దు

గొల్లలకోడేరు (భీమవరం పట్టణం), న్యూస్‌టుడే: గొల్లలకోడేరులోని జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించాల్సిన పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు ఎస్పీ అద్నాన్ నయిం అస్మి తెలిపారు. సీఎం చంద్రబాబునాయుడు పర్యటన నేపథ్యంలో బందోబస్తు, అధికారిక ఏర్పాట్లలో జిల్లా పోలీసు యంత్రాంగం నిమగ్నమై ఉన్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

బెల్లం ధరలతో ఆక్వాలో సెగలు

- 50 కిలోల బస్తాకు రూ.400 వరకు పెరుగుదల
- రైతులపై అదనపు భారం

మండవల్లి, న్యూస్‌టుడే: బెల్లం ధరలు పెరుగుదల ఆక్వా రంగాన్ని కలవరపెడుతున్నాయి. చేపలు రొయ్యల చెరువుల్లో నీటి నాణ్యతను మెరుగు పరచడంతో పాటు ఆమ్ల, క్షార గుణాల నియంత్రణకు బెల్లాన్ని తరచూ వాడుతుంటారు. ప్రొ బయాటిక్స్ పెంచేందుకు ఆక్వా సాగులో బెల్లాన్ని వినియోగిస్తారు. తాజాగా మార్కెట్‌లో బెల్లం ధరలు పెరగడంతో చెరువులకు ఉపయోగించే బెల్లం ధరలు సైతం ఆకాశాన్ని తాకుతున్నాయి. పెరిగిన సాగు వ్యయాలతో సతమతమవుతున్నా రైతులకు మరింత భారం పడుతోంది.



చెరువుకు ఉపయోగించే బెల్లం

కృత్రిమ కొరతతో ఇబ్బందులు

ఆక్వాలో చేపలు, రొయ్యల ఆరోగ్యానికి నీటి నాణ్యత ఎంతో కీలకం. నీటిలో పీహెచ్(ఆమ్లత్వం), ఆల్కనిటీ(క్షారత్వం) సూక్ష్మ జీవులు సమతుల్యతను కాపాడేందుకు బెల్లం ఉపయోగపడుతుంది. కానీ ప్రస్తుతం ధరలు పెరగడంతో మార్కెట్‌లో ఒక్కసారి దళారులు కృత్రిమ కొరతను సృష్టించి మరింతగా ధరలు పెంచేందుకు యత్నిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో ఇలా..

ఉమ్మడి జిల్లాలో 2.8 లక్షల ఎకరాల్లో ఆక్వా సాగు ఉండగా అందులో 1.2 లక్షల ఎకరాలు రొయ్యల చెరువులు, 1.6 ఎకరాల్లో చేపల సాగు చేస్తున్నారు. ప్రతి నెలా 400 టన్నుల బెల్లం చెరువులో వినియోగంతో పాటు 1.2 లక్షల లీటర్ల మొలాసిస్‌ను వినియోగిస్తున్నారు. పెరిగిన ధరలతో ఉమ్మడి జిల్లా రైతులకు రూ.60 లక్షల వరకు అదనపు భారం పడుతోంది.

నెల వ్యవధిలోనే..

జులై నెల చివరి వారం వరకు రూ.1300 ఉండే 50 కేజీల చెరువు బెల్లం ధర ప్రస్తుతం రూ.1700కు చేరింది. మరోపక్క చక్కెర కర్మాగారాల నుంచి కొనుగోలు చేసే మొలాసిస్ ధరలు సైతం వెయ్యి లీటర్లకు రూ.2000 నుంచి 3000 వరకు పెరిగాయి. బెల్లం ధరల పెరుగుదల నేరుగా ఉత్పత్తి వ్యయంపై పడుతుండడంతో రైతుకు మింగుడు పడటం లేదు.

ధరలు నియంత్రించాలి

ఇప్పటికే మేతలు, మందులు, కూలీల ఖర్చు, చెరువుల లీజులు పెరిగిపోయాయి. తాజాగా బెల్లం ధరలు పెరగడంతో భారం మరింతగా పెరుగుతోంది. సాగుకు అవసరమైన బెల్లం సరఫరాలో పారదర్శకతను తీసుకువచ్చి ధరల పెంపును అడ్డుకోవాలి. - నాగరాజు, రైతు, మండవల్లి

భీమవరం
• భీమవరం • ఉండి

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత


ప్రసంగిస్తున్న దత్తర్షిత సరస్వతి స్వామి

భీమవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: ఆధ్యాత్మిక చింతన, సామాజిక సేవలతో మానసిక ప్రశాంతత లభిస్తుందని సచ్చిదానంద సరస్వతి విశ్వవిజ్ఞాన పీఠం వ్యవస్థాపకులు దత్తర్షిత సరస్వతి స్వామి అన్నారు. ఆ పీఠం పట్టణశాఖ ఆధ్వర్యంలో జేపీ రోడ్డులోని ఆదిత్య హైస్కూల్ ప్రాంగణంలో 'ఆధ్యాత్మిక చైతన్యం- సామాజిక సేవా దృక్పథం' అంశంపై ఆదివారం ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. మానవ జన్మ ఎంతో పవిత్రమైనదని, నైతిక విలువలతో ముందుకు సాగితే జీవితానికి సార్థకత లభిస్తుందన్నారు.

నేడు పాలకమండలి సమావేశాలు

ఆకివీడు, న్యూస్‌టుడే: ఆకివీడు నగర పంచాయతీ పాలకమండలి అత్యవసర సమావేశాన్ని సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించనున్నట్లు కమిషనర్ కృష్ణమోహన్ తెలిపారు. ★ ఆకివీడు మండల ప్రజా పరిషత్తు కార్యాలయంలో పాలకమండలి సమావేశాన్ని సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో బాబూరావు తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

భీమవరం పట్టణం: 80085 74471	గునుపూడి: 80085 74474
భీమవరం మండలం: 80085 74533	వీరవాసరం: 80085 74475
పాలకోడేరు: 80085 74467	ఉండి: 80085 74526
ఆకివీడు: 80085 74525	కాళ్ల: 94401 04042

గునుపూడి, న్యూస్‌టుడే :? గునుపూడిలో మీ సేవా కేంద్రం వెనుక, నాచు వారి కూడలి ప్రధాన రహదారిలో పలుచోట్ల చెత్త గుట్టలుగా పేరుకుపోయింది. **-విజయకుమార్, భీమవరం.**

✔ పారిశుద్ధ్య పనులు చేయిస్తాం. **-సూర్యనారాయణరాజు, ఇన్‌ఛార్జి పారిశుద్ధ్య అధికారి.**

భీమవరం గ్రామీణ, న్యూస్‌టుడే: ? బర్రెవాని పేట వద్ద మలుపు ప్రమాదకరంగా తయారైంది. ఇక్కడ వేగ నిరోధకాలు ఏర్పాటు చేయాలి. **- శివ, లోసరి**

✔ రహదారి పనులు చేపట్టినప్పుడు సమస్యను పరిష్కరిస్తాం. **-రాజశేఖర్, ఆర్‌అండ్‌బీ ఏఈ**

ఆకివీడు, న్యూస్‌టుడే: ? అయిభీమవరం రోడ్డు కూడలి వద్ద భారీ గోతులతో వాహనచోదకులు అవస్థలు పడుతున్నారు. **-రంగారావు**

✔ పరిశీలించి త్వరలో మరమ్మతులు చేయిస్తాం. **-కె.శ్రీహరిరాజు, ఆర్‌అండ్‌బీ ఏఈ**

ఎడతెగని జాప్యం.. ఆక్రమణలకు ఆజ్యం



పాలకోడేరు, న్యూస్‌టుడే: మోగల్లు ప్రధాన కూడలి వద్ద ప్రధాన రహదారి వెంబడి ఉన్న అల్లూరి సీతారామరాజు ట్రస్టు భూమి ఇది. దీనిలో సుమారు 50 సెంట్ల భూమి ఆక్రమణలకు గురైంది. ప్రస్తుతం దీని విలువ రూ.కోట్లలో ఉంది. ఈ స్థలంలో ఆక్రమణలు తొలగించి తమకు స్వాధీనం చేయాలంటూ ట్రస్టు ప్రతినిధులు పలుమార్లు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గతేడాది ఆర్డీవో స్థానిక రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించినా పూర్తిస్థాయిలో హద్దులు గుర్తించకుండా వదిలేశారు. ఇటీవల ట్రస్టు సభ్యులు మరోమారు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. సుమారు పదేళ్లుగా ఫిర్యాదులు చేస్తున్నా సమస్య మాత్రం పరిష్కారం కాలేదని.. దీంతో ఆక్రమిత స్థలంలో శాశ్వత నిర్మాణాలు వెలుస్తున్నాయని ట్రస్టు సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ కూడలిలో సెంటు భూమి ధర సుమారు రూ.20 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు పలుకుతుంది. ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం ఆక్రమిత భూమి విలువ సుమారు రూ.12 కోట్లు వరకు ఉంటుందని ట్రస్టు సభ్యులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఆక్రమణలు తొలగించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని తహసీల్దారు లక్ష్మి తెలిపారు.

'స్థానిక' సమరం.. ఓటుకు సమయం

- నమోదుకు యువత ఆసక్తి
- సెప్టెంబరు 10వ తేదీ వరకు అవకాశం

ఉండి, న్యూస్‌టుడే: త్వరలో స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్న నేపథ్యంలో ఓటు నమోదుకు యువత ఆసక్తి చూపుతున్నారు. ఉండి నియోజకవర్గంలో ఈ నెల 22, 23, 29, 30 తేదీల్లో నిర్వహించిన ప్రత్యేక శిబిరాల్లో 532 మంది యువత ఓటు నమోదు కోసం ఫారం-6 దరఖాస్తులు సమర్పించారు. సెప్టెంబరు 10వ తేదీ వరకు సంబంధిత బూత్ స్థాయి అధికారులకు (బీఎల్‌వో) అర్హులు దరఖాస్తులు సమర్పించేందుకు అవకాశం ఉంది. దీంతో మరింత మంది యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. దీంతో పాటు 'సర్' ప్రక్రియ నేపథ్యంలో ఇతర ప్రాంతాల్లో నివాసం ఉంటున్న స్థానికులు తమ స్వగ్రామాల్లో ఓటు పునరుద్ధరణ కోసం దరఖాస్తులు అందిస్తున్నారు.

ముసాయిదా జాబితాల ప్రకారం ఓటర్ల వివరాలు మండలాల వారీగా..

మండలం	పురుషులు	మహిళలు	ఇతర	మొత్తం
ఆకివీడు	27,817	29,259	01	57,077
పాలకోడేరు	26,144	27,228	--	53,372
ఉండి	24,635	25,745	--	50,380
కాళ్ల	26,897	27,543	02	54,442

● తెలంగాణ రాష్ట్రం నిజమాబాద్‌లో ఉంటున్న పెదపుల్లేరు వాసులు ఏడుగురు స్థానికంగా తమకు ఓటు హక్కు కల్పించాలి కోరుతూ దరఖాస్తులు అందించారు.

● ఉణుదురు గ్రామానికి చెందిన మూడు కుటుంబాల ఓటర్లు కర్ణాటకలో ఉంటున్నారు. వారు కూడా స్థానికంగానే ఓటు హక్కు పొందేందుకు అన్ని ఆధారాలతో దరఖాస్తులు అందజేశారు. రాబోయే పది రోజుల్లో మరింత మంది ఓటు నమోదుకు దరఖాస్తులు చేసుకొనే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

కాలువల్లో అవరోధాల తొలగింపు

ఉండి, న్యూస్‌టుడే: ఉండిలోని ప్రధానవీధిలో మురుగు సమస్యపై ఈ నెల 28న 'రోడ్డు ఇలా.. రాకపోకలు ఎలా' శీర్షికతో 'ఈనాడు'లో ప్రచురితమైన వార్తకు పంచాయతీ అధికారులు స్పందించారు. అక్కడి కాలువల్లో మట్టి, అవరోధాల తొలగింపు పనులు చేయించారు.

ఈనాడు కథనానికి స్పందన

గైనకాలజిస్టు నియామకం

ఆకివీడు, న్యూస్‌టుడే: ఆకివీడు సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ)లో వైద్యుల కొరతతో రోగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై 'అన్నీ ఉన్నా.. అందని సేవలు' శీర్షికతో ఈ నెల 29న 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. గైనకాలజిస్టును నియమించి ప్రసూతి వైద్య సేవలను పునఃప్రారంభించినట్లు ఆసుపత్రి పర్యవేక్షకుడు విక్రమ్ తెలిపారు. ఇక నుంచి ప్రతి బుధ, శుక్రవారాల్లో గైనకాలజిస్టు ఆసుపత్రిలో అందుబాటులో ఉంటారని తెలిపారు.

వైభవంగా మావుళ్లమ్మ జాతర

భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: శ్రావణ మాసం సందర్భంగా పట్టణంలో మూడు వార్డుల్లో మావుళ్లమ్మ జాతరను ఆదివారం వైభవంగా నిర్వహించారు. 24వ వార్డులో లలితా దేవి ఆలయం వద్ద, రెస్టు హౌస్‌రోడ్డులో జాలర్ల సొసైటీ ఆధ్వర్యంలో, రామాలయం వద్ద తూర్పు కాపు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు పాల్గొని అమ్మవారికి పూజలు చేసి జాతర ఊరేగింపులను ప్రారంభించారు. శక్తి వేషధారణ కళాకారులు, ఆసాధుల నృత్యాలు, డప్పు వాయిద్యాలతో ప్రధాన వీధుల మీదుగా ఊరేగింపులు కొనసాగి రాత్రికి అమ్మవారి ఆలయానికి చేరుకున్నాయి.


అమ్మవారి సన్నిధిలో ఎమ్మెల్యే రామాంజనేయులు

8 గ్రాముల బంగారం సమర్పణ

భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: భీమవరం ఇలవేల్పు మావుళ్లమ్మ సంపూర్ణ స్వర్ణ వస్త్రానికి పట్టణానికి చెందిన మంగిన గురుమూర్తి దంపతులు 8 గ్రాములు బంగారాన్ని ఆదివారం సమర్పించారు. వారితో అర్చకులు ప్రత్యేక పూజలు చేయించి అమ్మవారి ఆశీర్వాదం అందించారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

కాళ్లకూరు (కాళ్ల), న్యూస్‌టుడే: కాళ్లకూరులో వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులకు రూ. లక్ష విరాళం సమకూరినట్లు దేవస్థానం ఛైర్మన్ అడ్డాల శివరామరాజు ఆదివారం తెలిపారు. పోతుమర్రు గ్రామానికి చెందిన నంబూరి వెంకట హరికృష్ణరాజు- రాధాకృష్ణవేణి దంపతులు, వారి కుమారుడు వెంకట పవన్ రామలింగ రాజు- భార్య శ్రుతి దంపతులు రూ. 1,00,116 నగదు అందించినట్లు తెలిపారు.

వైద్యం, మౌలిక వసతులకు ప్రాధాన్యం


మోగల్లు: శిలాఫలకం ఆవిష్కరించిన రఘురామ

పాలకోడేరు, న్యూస్‌టుడే: పల్లెల్లో రహదారులు, ఇతర మౌలిక వసతుల అభివృద్ధి, వైద్య సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఉండి ఎమ్మెల్యే, ఉప సభాపతి కనుమూరు రఘురామకృష్ణరాజు తెలిపారు. పాలకోడేరు మండలం మోగల్లులో సుమారు రూ. 70 లక్షల విలువైన అభివృద్ధి పనులను ఆయన ఆదివారం ప్రారంభించారు. స్థానిక మంచినీటి చెరువు వద్ద రూ.36 లక్షలతో నిర్మించిన ఆయుష్మాన్ భవనాన్ని, పేదలకాలనీ, గుత్తులవారి పాలెంలలో రూ.34 లక్షలతో నిర్మించిన మూడు సీసీ రహదారులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో వైద్య సేవలు అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. తెదేపా మండల అధ్యక్షుడు కొత్తపల్లి బాబు, సొసైటీ అధ్యక్షుడు నాగరాజు, నాయకులు కె.సందీప్‌వర్మ, సంకురుడు, కమ్మిల రాంబాబు, కామన రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

నవంబరులో చెకుముకి రాష్ట్ర పోటీలు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయిలో చెకుముకి సైన్సు పోటీలు, సంబరాలను భీమవరంలో నవంబరు 1, 2, 3 తేదీల్లో నిర్వహిస్తామని జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు కె.ఎస్. లక్ష్మణరావు తెలిపారు. సైన్సు సంబరాలు-2026 సన్నాహక సమావేశాన్ని భీమవరంలోని యూటీఎఫ్ భవనంలో ఆదివారం నిర్వహించారు. శాస్త్ర విజ్ఞానంపై విద్యార్థులకు అవగాహన, అభిరుచి పెంపొందించడమే సైన్సు సంబరాల ముఖ్య ఉద్దేశమన్నారు. సమావేశంలో జేవీవీ రాష్ట్ర కార్యదర్శి పి.సురేశ్, కె.ఎం.ఆర్.ప్రసాద్, రామలక్ష్మణరావు, ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

ఆదమరిస్తే.. కాలువలోకే..



మత్స్యపురిపాలెం (వీరవాసరం), న్యూస్‌టుడే: మత్స్యపురిపాలెం శివారు కమతాలపల్లి వద్ద పంట కాలువపై ఉన్న వంతెనకు రక్షణ గోడలు దెబ్బతినడంతో వాహన చోదకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ వంతెనపై గతంలో భారీ వాహనాలు రాకపోకలు సాగించడంతో రక్షణ గోడలు దెబ్బతిన్నాయి. వాటికి మరమ్మతులు చేయించకపోవడంతో రాత్రి వేళ ద్విచక్ర వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఆ వంతెనను పరిశీలించి మరమ్మతులకు చర్యలు తీసుకుంటానని ఆర్‌అండ్‌బీ ఏఈ డీఎస్ఎన్ మూర్తి తెలిపారు.


ఉపకార వేతనాలు అందుకున్నవారితో ఎంపీ సత్యనారాయణ, నిర్వాహకులు

విద్యతోనే అభ్యున్నతి సాధ్యం

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: విద్యతోనే అభ్యున్నతి సాధ్యమని, ప్రతిభావంతులైన పేద చేయూత నివ్వడం అభినందనీయమని రాజ్యసభ సభ్యుడు పాకా వెంకట సత్యనారాయణ అన్నారు. లక్ష్మీ తార ఛారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు గూడూరి కపిలేశ్వరరావు, కార్తిక్, సరిత, మైథిలి తార సౌజన్యంతో విద్యార్థులకు ఆదివారం ఉపకార వేతనాలు పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో ఎంపీ పాల్గొని మాట్లాడారు. భీమవరంలోని శ్రీ వేంకటేశ్వర బధిరోన్నత పాఠశాలలో 77 మంది విద్యార్థులకు నూతన వస్త్రాలు, రూ.40 వేల ఉపకార వేతనాలు అందించారు.

పారిశుద్ధ్య కార్మికులకు న్యాయం చేయండి


ఉండి, న్యూస్‌టుడే: పంచాయతీల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించి న్యాయం చేయాలని పంచాయతీ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ డిమాండ్ చేసింది. ఉండి పంచాయతీ కార్యాలయం వద్ద ఆదివారం సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు ఎం.ఆంజనేయులు మాట్లాడుతూ రూ.లక్షల్లో జీతాలు పొందే ఉద్యోగులకు వారానికి ఒక రోజు సెలవు ఉందన్నారు. కేవలం రూ.10 వేల నుంచి 15 వేల వేతనం వచ్చే పారిశుద్ధ్య కార్మికులకు సెలవులేదని పంచాయతీ కార్యదర్శి హుకుం జారీ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు.

ఉత్తమ కవిగా నారాయణరాజు

పెదకాపవరం (ఆకివీడు), న్యూస్‌టుడే: తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో 'తెలుగు వైభవం' అంశంపై ఆన్‌లైన్‌లో కవితల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పాల్గొన్న పెదకాపవరం గ్రామానికి చెందిన గాదిరాజు హేమ లక్ష్మీ నారాయణరాజు ఉత్తమ పురస్కారానికి ఎంపికయ్యారు. శనివారం సాయంత్రం ఏలూరులో గమిని కల్యాణ మండపంలో నిర్వహించిన కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు ఆయనను సత్కరించి ఉత్తమ కవి పురస్కారం, ప్రశంసాపత్రం అందజేశారు.

కనీస వసతులూ కరవే..

పాలకోడేరు, న్యూస్‌టుడే: పాలకోడేరు పరిధి కోడిగట్టు ఎస్సీ కాలనీ సమీపాన ఉన్న పేదల కాలనీలో అంతర్గత రహదారులు లేకపోవడంతో నివాసితులు నిత్యం అవస్థలు ఎదుర్కొంటున్నారు. గత ప్రభుత్వ హయాంలో పొలాల మధ్య భూములను సేకరించి 235 మందికి స్థలాలు కేటాయించి ఈ కాలనీని ఏర్పాటు చేశారు. ఇక్కడికి చేరేందుకు అప్పట్లో పంట కాలువ గట్టు మీదుగా గ్రావెల్ రోడ్డు ఏర్పాటు చేశారు. 204 మందికి ఇళ్లు మంజూరు చేయగా ప్రస్తుతం 150 మంది గృహాలు నిర్మించుకుని నివసిస్తున్నారు. అప్పటి నుంచి అంతర్గత రహదారులు, డ్రెయినేజీలు, ఇతర సౌకర్యాలను కల్పించకపోవడంతో వారంతా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షం వస్తే ఇళ్ల మధ్య ఖాళీ స్థలాల్లో రోజుల తరబడి నీరు నిలిచిపోతుందని స్థానిక మహిళలు వాపోతున్నారు. మరో పక్క అంతర్గత మార్గాలు బురదగా మారి ఇళ్ల నుంచి బయటకు రాలేని పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి ప్రధాన రోడ్డుతో పాటు అంతర్గత మార్గాలు నిర్మించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.





ఒరిగిన స్తంభాలు.. కూలితే ముప్పే!

ఉండి, న్యూస్‌టుడే: ఉండి- ఉప్పుగుంట మార్గంలో రెండు విద్యుత్తు స్తంభాలు ఒరిగిపోయి ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. ఆక్వా చెరువులకు ఆనుకొని నల్లరేగడి నేలలో ఉన్న ఈ స్తంభాలతో ఎప్పుడు ఏ ముప్పు ముంచుకొస్తుందోనని స్థానికులు, వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బళ్లు ఆపేసి.. దారి మూసేసి!

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: భీమవరం పట్టణ పరిధి లంకపేట ప్రాంతంలో రైల్వే దిగువ వంతెన(ఆర్‌యూబీ) సమీపాన ఇళ్లను రహదారి విస్తరణ కోసం మూడేళ్ల కిందట తొలగించారు. అప్పటి నుంచి ఆ స్థలాన్ని ఖాళీగా వదిలేయడంతో ప్రైవేటు వాహనాలు ఉంచుతున్నారు. దీంతో ఆర్‌యూబీ నుంచి వేగంగా పైకి వచ్చే వాహనాలు తరచూ ప్రమాదాలకు గురవుతున్నాయి. డాక్టర్ బీవీరాజు విగ్రహం కూడలి వరకు దాదాపు కిలోమీటరు పొడవునా ప్రైవేటు వాహనాలు నిలపడంతో పాటు కొందరు నిర్మాణ సామగ్రి వేస్తున్నారు. దీంతో తరచూ ట్రాఫిక్ ఇబ్బందులు తప్పడం లేదని వాహనదారులు వాపోతున్నారు.



అడుగేస్తే.. తీయలేం



ఉండి, న్యూస్‌టుడే: శివారు ప్రాంతాల్లో వ్యవసాయ భూములకు వెళ్లేందుకు పుంత మార్గాలే ప్రధాన ఆధారం. వీటి నిర్వహణ, అభివృద్ధిపై గత పాలకులు దృష్టి సారించకపోవడంతో అధ్వానంగా తయారయ్యాయి. ఉండి నియోజకవర్గంలో ఆకివీడు, ఉండి మార్కెట్ యార్డుల పరిధిలో సుమారు 150కి పైగా పుంత మార్గాలు వర్షం కురిస్తే చాలు బురద కయ్యల్లా మారి కనీసం అడుగు తీసి అడుగే యలేని దుర్భర స్థితికి చేరాయి. దీంతో ఎరువులు, పురుగు మందులు తీసుకెళ్లేందుకు, పంట ఉత్పత్తులను మార్కెట్‌కు తరలించేందుకు రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. మార్కెట్ యార్డులకు సెస్ రూపంలో ఏటా రూ.కోట్లలో చెల్లిస్తున్నప్పటికీ.. వసతుల కల్పనకు అవసరమైన నిధులు కేటాయించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అందుబాటులో అధునాతన వైద్య సేవలు


ఆసుపత్రిని ప్రారంభిస్తున్న శ్రీనివాసవర్మ

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: అత్యాధునిక ప్రమాణాలతో ఆంకాలజీ, ఐవీఎఫ్ వైద్య సేవలను భీమవరం ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. డీఎన్నార్ కళాశాల రోడ్డులో ఏర్పాటు చేసిన పల్లవి సుధీర్స్ మెడికేర్ ఆసుపత్రిని ఆయన ఆదివారం ప్రారంభించారు. ఉప సభాపతి కనుమూరు రఘురామకృష్ణరాజు, రాజ్యసభ సభ్యుడు పాకా వెంకట సత్యనారాయణ, ఎమ్మెల్యే రామాంజనేయులు, కలెక్టర్ చదలవాడ నాగరాణి, మాజీ ఎంపీ తోట సీతారామలక్ష్మి, ఏపీ ఐఐసీ ఛైర్మన్ మంతెన రామరాజు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సంఘాలకు తివాచీలు

వీరవాసరం, న్యూస్‌టుడే: స్వయం సహాయక సంఘాల మహిళలు ప్రతి నెలా స్థానిక గ్రామ సమాఖ్య, సామాజిక భవనాలు, ఆలయాల అరుగులపై, నేలపైన కూర్చొని సమావేశాలు నిర్వహించుకుంటున్నారు. ఆయా ప్రాంతాలు అపరిశుభ్రంగా ఉండటంతో వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం సమావేశాల నిర్వహణకు గ్రామ సంఘాలకు తివాచీలు సరఫరా చేసినట్లు వెలుగు ఏపీఎం ఎలీనారాణి తెలిపారు. జిల్లా కేంద్రం నుంచి వచ్చిన తివాచీలను 46 గ్రామ సంఘాలకు త్వరలోనే అందజేస్తామని వెల్లడించారు.

కల్యాణ మండపం నిర్మాణానికి శంకుస్థాపన

భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: భీమేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో కల్యాణ మండపం, కాలక్షేప మండపం నిర్మాణాలకు ఆదివారం ఉదయం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు శంకుస్థాపన చేశారు. ప్రధాన దాతలు బొండా సత్యనారాయణమూర్తి దంపతులు, బొండా సత్యకిశోర్ దంపతులతో అర్చకులు పూజలు చేయించారు.

జూద శిబిరాలపై దాడులు

కాళ్ల, న్యూస్‌టుడే: కాళ్ల మండలం సీసలి గ్రామంలో కోడిపందేల స్థావరంపై ఆదివారం దాడి చేసి ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎస్సై గణేశ్ కుమార్ తెలిపారు. ★ ఏలూరుపాడులో నిర్వహిస్తున్న జూద స్థావరంపై ఆదివారం పోలీసులు దాడి చేశారు. అక్కడ జూదాలు ఆడుతున్న నలుగురిని అదుపులోనికి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

హద్దు మీరితే చర్యలు తప్పవు

ఆకివీడు, న్యూస్‌టుడే: హద్దు మీరితే కఠిన చర్యలు తప్పవని ఎస్సై శుభశేఖర్ హెచ్చరించారు. ఆదివారం ఆకివీడు పోలీస్‌స్టేషన్ వద్ద రౌడీ షీటర్లకు ఆయన కౌన్సెలింగ్ ఇచ్చారు. స్థానిక ఎన్నికల నేపథ్యంలో రౌడీ షీటర్లపై నిఘా కొనసాగుతుందన్నారు. ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కల్పిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. స్థానిక గంగానమ్మకోడు ప్రాంతానికి చెందిన పలువురికి కౌన్సెలింగ్ ఇచ్చారు.

హామీలు అమలు చేయండి: సీపీఎం


మాట్లాడుతున్న గోపాలన్

భీమవరం వన్‌టౌన్, న్యూస్‌టుడే: కోటిపల్లి- నరసాపురం రైల్వే లైను పనులు ప్రారంభించి పుష్కరాల లోపు పూర్తి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జేఎన్‌వీ గోపాలన్ కోరారు. మెంటేవారితోటలోని సుందరయ్య భవనంలో ఆదివారం సీపీఎం జిల్లా సమావేశాన్ని ఆ పార్టీ నాయకుడు బి.వాసుదేవరావు అధ్యక్షతన నిర్వహించారు. గోపాలన్ మాట్లాడుతూ రైల్వే లైను పనుల్లో జాప్యం కారణంగా అంచనా వ్యయం రూ.2 వేల కోట్ల నుంచి రూ.4 వేల కోట్లకు పెరిగిందన్నారు. బియ్యపుతిప్ప వద్ద షిప్పింగ్ హార్బర్‌కు 2002లో శంకుస్థాపన చేయగా పనులు మధ్యలో నిలిచిపోయాయన్నారు. భీమవరం పట్టణంలో కంపోస్టు యార్డు ఏర్పాటు చేయాలన్నారు.

నిర్వహణ లేమితో సాగునీటి ఇబ్బందులు.. వీరవాసరం, న్యూస్‌టుడే: పంట, మురుగు కాలువల ఆధునికీకరణ పనులు చేపట్టి రైతులను ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆకుల హరేరామ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వీరవాసరంలోని సీపీఎం కార్యాలయంలో ఆదివారం రైతు సంఘం మండల సమావేశాన్ని అధ్యక్షుడు బాలం విజయ్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. హరేరామ్ మాట్లాడుతూ పీర్లకోడు పంట కాలువలో వ్యర్థాలు, తూడు పేరుకుపోవడంతో సాగునీరు సరిగా అందడంలేదన్నారు. రాణీకోడు డ్రెయినులో వ్యర్థాలు పేరుకుపోవడంతో ముంపు సమస్య ఏర్పడే అవకాశం ఉందన్నారు. నిర్వహణ పనులు చేపట్టకపోవడమే దీనికి కారణమన్నారు.

సర్వేల్లో తప్పులు.. పథకాలు అందక తిప్పలు

కార్యాలయాల చుట్టూ బాధితుల ప్రదక్షిణలు

ఆకివీడు, న్యూస్‌టుడే: సర్వేల్లో, ఆన్‌లైన్‌లో నమోదు ప్రక్రియలో పేర్లు, చిరునామా, ఆస్తులు వివరాలు తప్పుగా నమోదు కావడంతో కొందరు సంక్షేమ పథకాల లబ్ధి కోల్పోయారు. ఇలాంటి వారంతా తప్పులను సరిచేయాలంటూ ఏళ్ల తరబడి కార్యాలయాలు చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేకుండా పోయింది. వైకాపా పాలనలో జరిగిన సర్వేల్లోనే తప్పులు దొర్లాయని పలువురు వాపోతున్నారు. 2020 జనవరి 28న ఆకివీడుకు నగర పంచాయతీ హోదా ఇవ్వగానే ఇంటి, కుళాయి పన్నులను పెంచేశారు. పురపాలక నిబంధనల మేరకు ప్రతి ఆరు నెలలకు పన్ను చెల్లించే నిబంధనను అమల్లోకి తీసుకొచ్చారు. ఈ క్రమంలో సర్వే చేయించి పన్నుల వివరాలు ఆన్‌లైన్ చేశారు. పలు కుటుంబాలకు సంబంధించిన ఆస్తి వివరాలు, ఇంటి నంబర్లు, చిరునామాల్లో తప్పులు ఉన్నాయి. వాటిని సరిచేయాలంటూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా తమ గోడు వినేవారు లేరని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యను నగర పంచాయతీ కమిషనర్ కృష్ణమోహన్ దృష్టికి తీసుకెళ్లగా.. పన్నుల రసీదుల్లో లోపాల సవరణకు చర్యలు చేపడతామని పేర్కొన్నారు.



లేని ఆస్తులు నమోదు చేసి.. మాకు పట్టణంలో చిన్న ఇల్లు ఉంది. కానీ రెండు పెద్ద గృహాలు ఉన్నట్లు ఆన్‌లైన్‌లో నమోదైంది. దీంతో నా కుమారుడి కుటుంబానికి రేషన్ కార్డు పొందే అర్హత లేదని సిబ్బంది చెబుతున్నారు. మాకు లేని ఆస్తులను నమోదు చేశారని చెబుతున్నా పట్టించుకోవడం లేదు. ఇటీవల నా కుమారుడికి రోడ్డు ప్రమాదంలో కాలు విరిగి మంచానికే పరిమితమై ఉన్నాడు. అతడికి భార్య, ఇద్దరు చిన్న పిల్లలున్నారు. వారికి ఏ ఆధారం లేదు. అధికారులను అడిగితే చేస్తాం..చూస్తాం అంటూ కాలయాపన చేస్తున్నారు. **- తాడి లక్ష్మీకుమారి, మాదివాడ**



ఏళ్లు గడిచిపోతున్నాయ్.. స్థానిక గుమ్ములూరు కూడలి వద్ద కిళ్లీ దుకాణం నిర్వహిస్తూ జీవనోపాధి పొందుతున్నా. నా కుమార్తెకు వివాహం అయి భర్త మృతి చెందారు. నాకున్న కొద్దిపాటి ఆస్తి, మా అమ్మాయి పేరిట ఉన్న ఒక దుకాణం కలిపి ఒకే ఆస్తిగా ఆన్‌లైన్‌లో నమోదు నమోదు చేశారు. దీంతో పాటు మాకు చెందని మరో 30 సెంట్ల స్థలం ఉన్నట్లు ఆన్‌లైన్లో నమోదైంది. ఈ క్రమంలో నా కుమార్తెకు వితంతు పింఛను, గ్యాస్ రాయితీ, ఇతర పథకాలు వర్తించడం లేదు. తప్పులు సరిచేయాలని ఏళ్ల తరబడి కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేదు.
-కరణం హరిబాబు, గుమ్ములూరు కూడలి

నరసాపురం

• నరసాపురం • పాలకొల్లు • ఆచంట

యువతలో దేశభక్తి, దైవభక్తి మరింత పెరగాలి

పోడూరు, న్యూస్‌టుడే: యువతలో దేశభక్తి, దైవభక్తి మరింత పెరగాలని రాష్ట్ర అర్చక వేద మండలి విభాగ ప్రముఖ్ శివశంకర్ ఆకాంక్షించారు. పోడూరు మూలేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం జరిగిన విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్ విభాగాల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. యువకులంతా శారీరక దారుఢ్యం పెంపుకుని మంచి అలవాట్లతో జీవించాలన్నారు. ఈ సందర్భంగా పోడూరు మండల విశ్వ హిందూ పరిషత్ అధ్యక్షుడిగా గెద్దాడ హరీష్, ఉపాధ్యక్షుడిగా గెద్దాడ మోహన్‌లను నియమించారు. కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు శీలబోయిన జయరామకృష్ణ, తోలేటి వేణు, చెల్లబోయిన సత్యనారాయణ, కోలా విజయకుమార్ పాల్గొన్నారు.

అతివలు.. మీరే వ్యాపారవేత్తలు

• మెప్మా మహిళలకు వ్యక్తిగత రుణాలు • వ్యాపారంలో రాణించేలా శిక్షణ

పాలకొల్లు, న్యూస్‌టుడే

పట్టణాల్లో స్వయం సహాయక సంఘాలకు చెందిన మహిళలు అంచెలంచెలుగా ఎదగాలని అనేక అవకాశాలు ఎదురుచూస్తున్నాయి. ఆసక్తి, అనుభవం ఉన్న రంగంలో వ్యాపారం ప్రారంభించుకుని ఆదాయం సంపాదించుకునేలా మెప్మా ద్వారా బ్యాంకు రుణాలు అందిస్తున్నారు. ఒకటి రెండు కాదు 11 రకాల జీవనోపాధి మార్గాలను మహిళల ముందుకు తెచ్చింది. ఆర్థిక సహాయం అందించడమే గాక నైపుణ్య శిక్షణ, బ్రాండింగ్, మార్కెటింగ్‌లకు సంబంధించిన శిక్షణ ఇవ్వనున్నారు. మహిళల ఆర్థిక స్వావలంబనకు ఇంతకు మించిన అవకాశం చేజారకుండానే పట్టణాల్లో మగువలు సద్వినియోగం చేసుకోవాల్సి ఉంది.


మహిళలకు అవగాహన కల్పిస్తున్న ఆర్పీలు

పాలకొల్లుకు చెందిన మహిళ కుటుంబానికి తన వంతు అండగా నిలవడానికి ఏదైనా దుకాణం ఏర్పాటు చేసి ఉపాధి పొందాలని భావిస్తున్నారు. ఆ విషయాన్ని మెప్మా ఆర్పీలకు తెలియజేయగా.. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను ఆమెకు వివరించి ప్రముఖ సంస్థకు చెందిన ఫ్రాంఛైజీ తీసుకుని టీ టైమ్ పేరిట పట్టణంలో దుకాణం పెట్టుకోవడానికి మార్గం చూపించారు. త్వరలో పేరుగాంచిన పలు రకాల టీలు లభించే దుకాణం ఏర్పాటు చేయబోతున్నారు. నెలకు కనీసం రూ.35 వేలు ఆదాయం వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

ప్రోత్సాహం ఇలా.. • పట్టణాల్లో తోపుడు బండిపై హోటల్ వ్యాపారం చేసే మహిళలు ఉంటారు. వీరు తృప్తి క్యాంటీన్ పేరిట హోటల్ ఏర్పాటు చేసుకుంటే రూ.13 లక్షలకు పైగా రుణం అందించనున్నారు. బాగా చేసుకుంటే నెలకు రూ.50 వేల ఆదాయం పొందవచ్చు. • టీ టైమ్ దుకాణాలు ఏర్పాటు చేసుకోవడానికి రూ.3 లక్షలకు పైగా రుణం ఇవ్వనున్నారు. ఆదాయం నెలకు రూ.30 వేలు దాటుతుందని అంచనా. • ఎంబ్రాయిడరింగ్ చేసుకునే మహిళలకు రూ.4 లక్షల నుంచి రూ.8 లక్షల వరకు రుణాలివ్వనున్నారు. దర్జీలుగా రాణిస్తున్న మహిళలు ఆయా యూనిట్లు పెట్టుకుంటే నెలకు దర్జాగా రూ.50 వేల ఆదాయం సంపాదించవచ్చు. • నిత్యావసరాలు విక్రయించే రిటైల్ మైక్రోసేల్స్ పెట్టుకుంటే రూ.6 లక్షల వరకు రుణం ఇస్తారు. రూ.30 వేలకు పైగా ఆదాయం ఆర్జించవచ్చని అధికారులు చెబుతున్నారు.

24 వేల మందికి అవకాశం

పాలకొల్లు పట్టణంలో 16 వేల మంది, నరసాపురంలో 8,300 మంది మెప్మా మహిళలున్నారు. వీరిలో ఆసక్తి ఉండి ఆర్థికంగా నిలదొక్కుకోవాలనే కాంక్ష ఉన్నవారంతా దీనికి అర్హులే. ఎంతమంది దరఖాస్తు చేసుకున్నా.. పరిమితి లేకుండా అందరికీ అవకాశం కల్పిస్తామని నరసాపురం మెప్మా అధికారి రత్నాకర్ చెబుతున్నారు. ఇప్పటికే దీనిపై ఆర్పీలు వార్డుల వారీగా అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.

దహన సంస్కారాలా.. చేసుకోండి ఆ చెత్తలో..

పోడూరు, పాలకొల్లు గ్రామీణ, యలమంచిలి: గ్రామాల్లో సేకరించిన చెత్తను ఎక్కడ వేయాలో తెలియక పంచాయతీ అధికారులు అగచాట్లు పడుతున్నారు. ప్రతి గ్రామంలోనూ సంపద కేంద్రాలున్నా.. అవి అలంకారప్రాయంగా మారాయి. దీంతో కాలువ గట్లు, రహదారులు, శ్మశానవాటికలు డంపింగ్ యార్డులుగా మారుస్తున్నారు. యలమంచిలి, ఆచంట, వాసవీ పెనుగొండ, నరసాపురం మండలాల్లో ఇదే పరిస్థితి నెలకొందని స్థానికులు చెబుతున్నారు. ఈ విషయమై ఉప ఎంపీడీవో పదాల నాగిరెడ్డి మాట్లాడుతూ.. శ్మశాన వాటికల్లో చెత్త వేయకుండా పంచాయతీ కార్యదర్శులకు సూచనలు చేస్తామన్నారు.



• ఇది పోడూరు మండలం వద్దిపర్రు శివారు చింతలపాలెంలోని కోనేటిగట్టును ఆనుకుని ఉన్న శ్మశాన వాటిక. చింతలపాలెంలో సేకరించిన చెత్తను శ్మశానంలో వేస్తున్నారు. దీంతో దహన సంస్కారాలు నిర్వహించడానికి వచ్చే స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా రహదారిపైనే చెత్త వేయడంతో ఈ రహదారి మీదుగా కోనేటిగట్టున నివాసం ఉండే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. చింతలపాలెంలో అనువైన స్థలం లేక తాత్కాలికంగా శ్మశాన వాటికలో చెత్తను వేసి పది రోజులకు ఒకసారి సంపద కేంద్రానికి తరలిస్తున్నట్లు పంచాయతీ అధికారులు చెబుతున్నారు.



• ఇది పాలకొల్లు మండలం లంకలకోడేరులోని శ్మశాన వాటిక. గ్రామంలో సేకరించిన చెత్తను శ్మశాన వాటికలో వేసి తగలబెడుతున్నారు. శ్మశాన వాటిక సమీపంలో సంపద కేంద్రం ఉన్నప్పటికీ దానిని వినియోగించడం లేదు. వర్షాలు, చెత్త శ్మశానంలో వేయడంతో అంతిమ సంస్కారాలు నిర్వహించడానికి ఇబ్బంది పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. వర్షాకాలంలో చెత్త తడిసి దుర్వాసన వస్తోంది.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

నరసాపురం : 80085 74504	ఆచంట: 90631 44737
పాలకొల్లు : 80085 74510	వాసవీ పెనుగొండ: 80085 74469
పోడూరు : 90631 44741	పెనుమంట్ర: 91212 29087

నరసాపురం, న్యూస్‌టుడే: ? వైఎస్ఆర్ కాలనీలో మురుగు డ్రెయిన్ల నిర్వహణ సక్రమంగా లేదు. **- చినబాబు, నరసాపురం**
✔ వెంటనే పరిశీలించి మురుగు తొలగించేందుకు చర్యలు తీసుకుంటాను. **- సత్యనారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: ? నరసాపురం పట్టణంలో మఠం వీధిలో డ్రెయిన్లలో మురుగు పారడం లేదు. ఇబ్బంది పడుతున్నాం. **- జి.సత్యనారాయణ, నరసాపురం**
✔ డ్రెయిన్లలో శుభ్రం చేసేందుకు చర్యలు చేపడతాం. **- సత్యనారాయణ, పురపాలక శానిటరీ ఇన్‌స్పెక్టర్**

పాలకొల్లు గ్రామీణ, న్యూస్‌టుడే: ? పాలకొల్లు మండలం చింతపర్రు వీవర్స్ కాలనీలో పిచ్చి మొక్కలు పెరగడంతో రాత్రి విష పురుగులు సంచరిస్తున్నాయి. **- వంశీ, స్థానికుడు**
✔ పరిశీలించి మొక్కలు తొలగిస్తాం. **- కె.రాజేశ్, ఇన్‌ఛార్జి పంచాయతీ కార్యదర్శి**

మొగల్తూరు, న్యూస్‌టుడే: ? పేరుపాలెంనార్తులో రహదారి పక్కన చెత్త వేయడంతో దాన్నుంచి దుర్వాసన వెదజల్లి ఇబ్బంది పడుతున్నాం. **- అందె ఫణీంద్రనాథ్, పేరుపాలెంనార్తు**
✔ సమస్య పరిష్కరించాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేస్తా. **- ఎం.నవీన్‌కిరణ్, ఉప ఎంపీడీవో**

ఉచిత కంటి వైద్య శిబిరం

ఆచంట, న్యూస్‌టుడే: ఆచంట మండలం వల్లూరులో జనసేన ఆధ్వర్యంలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ జన్మదినోత్సవ వేడుకలు వినూత్నంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. మరో మూడు రోజుల పాటు సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామన్నారు.

తెదేపా నాయకుల పరిశీలన


ఏర్పాట్లను పరిశీలిస్తున్న రామరాజు తదితరులు

నరసాపురం, మొగల్తూరు, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబు వచ్చే నెల 1న నియోజకవర్గంలో పర్యటించనున్న ప్రాంతాలను ఆదివారం తెదేపా నాయకులు పరిశీలించారు. తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు ఆధ్వర్యంలో పర్యటన ఇన్‌ఛార్జి పెందుర్తి వెంకటేశ్వరరావు, పార్లమెంటు నియోజకవర్గ పరిశీలకుడు దాసరి శేషు ఆయా ప్రాంతాల్లో పరిశీలించి ఏర్పాట్లపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ జక్కం శ్రీమన్నారాయణ, మత్స్యకార కార్పొరేషన్ ఛైర్మన్ కొల్లు పెద్దిరాజు, కొప్పాడ రవి, నాగిడి రాంబాబు, గుబ్బల నాగరాజు, కుక్కల వాసు, వాతాడి ఉమ, డొల్ల రత్నంరాజు, సజ్జ వాసు తదితరులు పాల్గొన్నారు.

ఖుషీగా తెలుగు తమ్ముళ్లు.. నరసాపురం, మొగల్తూరు, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పర్యటన సందర్భంగా నియోజకవర్గంలో తెలుగు తమ్ముళ్లు ఖుషీ ఖుషీగా ఉన్నారు. అధినేత చంద్రబాబు క్యాడర్‌తో సమావేశానికి ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు ఆధ్వర్యంలో సుమారు 1400 మంది తెలుగు తమ్ముళ్లను ఎంపిక చేస్తున్నారు. దీంతో వారంతా అధినేతను కలిసేందుకు ఆత్రుతగా ఎదురు చూస్తున్నారు.

1, 2 తేదీల్లో ఉపాధి శ్రామికులు, పర్యవేక్షకులకు శిక్షణ

పోడూరు, న్యూస్‌టుడే: సెప్టెంబరు 1, 2 తేదీల్లో పాలకొల్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఉపాధి శ్రామికులు, పర్యవేక్షకులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి ఎం.మోజేశ్ తెలిపారు. 1న ఉపాధి శ్రామికులు, 2న పర్యవేక్షకులకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కొత్తగా ప్రవేశపెట్టిన వీబీజీ రామ్ జీ అమలు తీరు తెన్నులు, ఉపాధి శ్రామికులు ఎదుర్కొంటున్న సమస్యలపై రాష్ట్ర నాయకులు పాల్గొని వివరిస్తారన్నారు.

నేడు పీహెచ్‌సీ నిర్మాణ పనులకు శంకుస్థాపన

పోడూరు, న్యూస్‌టుడే: గుమ్మలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర నూతన భవన నిర్మాణ పనులకు సోమవారం ఉదయం పది గంటలకు ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ శంకుస్థాపన చేయనున్నట్లు పీహెచ్‌సీ వైద్యాధికారి జి.నరేశ్ తెలిపారు. ఈ భవన నిర్మాణ పనులకు సుమారు రూ.1.93 కోట్లు మంజూరైనట్లు ఆయన తెలిపారు. ఏపీఎంఎస్ఐడీసీ ఆధ్వర్యంలో పనులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

వృద్ధులకు పండ్లు పంపిణీ

యలమంచిలి, న్యూస్‌టుడే: తెదేపా యలమంచిలి మండల అధ్యక్షుడు మామిడిశెట్టి పెద్దిరాజు జన్మదినోత్సవం సందర్భంగా తెదేపా నాయకుల ఆధ్వర్యంలో ఆదివారం పలు సేవాకార్యక్రమాలు చేపట్టారు. బూరుగుపల్లి, దొడ్డిపట్ల ప్రాంతాల్లోని వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఇలపకుర్రులో తెదేపా మండల నాయకులు హాజరై కేకు కోసి పెద్దిరాజుకు శుభాకాంక్షలు తెలియజేశారు. మాజీ జడ్పీటీసీ బోనం నాని, నాయకులు సానబోయిన శ్రీనివాస్, చికిలే కనకరాజు, పీతల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా మహా చండీ హోమం


కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: నరసాపురం పట్టణం పాలంకి మాణిక్యం వీధిలోని పుంతలో ముసలమ్మ అమ్మవారి ఆలయంలో శైవాగమ పండితులు వెలమపల్లి చంద్రశేఖరశర్మ ఆధ్వర్యంలో ఆదివారం మహా చండీహోమం నిర్వహించారు. వేడుకలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

వినాయక చవితికి ఏర్పాట్లు


పందిరి రాటకు పూజలు చేస్తున్న నిర్వాహకులు

పాలకొల్లు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: పాలకొల్లులో సెప్టెంబరు 14 నుంచి ప్రారంభమయ్యే వినాయక చవితి మహోత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేసేందుకు సమాయత్తమయ్యారు. స్థానిక అచ్చుగట్లపాలెం విఘ్నేశ్వర యువజన కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఉత్సవాల కోసం ఆదివారం పందిరి రాటను వేసి పూజలు చేశారు. చినిమిల్లి పవన్, కౌషిక్, భాను, చందు తదితరులున్నారు.

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత

భీమవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: ఆధ్యాత్మిక చింతన, సామాజిక సేవలతో మానసిక ప్రశాంతత లభిస్తుందని సచ్చిదానంద సరస్వతి విశ్వవిజ్ఞాన పీఠం వ్యవస్థాపకులు దత్తర్షిత సరస్వతి స్వామి అన్నారు. ఆ పీఠం పట్టణశాఖ ఆధ్వర్యంలో జేపీ రోడ్డులోని ఆదిత్య హైస్కూల్ ప్రాంగణంలో 'ఆధ్యాత్మిక చైతన్యం- సామాజిక సేవా దృక్పథం' అంశంపై ఆదివారం ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు.

ఆదిత్యుడికి పూజలు



నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: నరసాపురం పట్టణంలోని వశిష్ఠ గోదావరి తీరాన ఉన్న రమా ఛాయా సమేత సూర్యనారాయణస్వామి ఆలయంలో ఆదివారం గణపతి, సూర్యనారాయణమూర్తులకు పంచామృతాభిషేకాలు, క్షీరాభిషేకాలు నిర్వహించారు. అనంతరం వివిధ పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి పంచ హారతులు ఇచ్చారు.

సూర్య దేవాలయంలో అభిషేకాలు

పాలకొల్లు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: పాలకొల్లు హనుమాన్ కాలనీలోని సరస్వతీశిశు మందిర్‌లో రాష్ట్ర ధార్మిక సామాజిక పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం సూర్య హోమాలు జరిపించారు. ● స్థానిక కోడిగట్టు సర్వోదయపురం సూర్య దేవాలయంలో స్వామివారికి విశేష అభిషేకాలు నిర్వహించారు.



పేరుకే సీసీ.. పొడవునా నెర్రెలు తీసి

సీసీ రహదారుల నిర్మాణంలో నాణ్యత నట్టేట కలుస్తోంది. రూ.లక్షలు వెచ్చించి నిర్మిస్తున్న రహదారులు పొడవునా.. అడ్డంగా చీలిపోతున్నాయి. యలమంచిలి మండలం వడ్డిలంక నుంచి కట్టుకాల్వ వెళ్లే ప్రధాన రహదారిదీ ఇదే దుస్థితి. కిలోమీటర్‌కు పైగా తీసిన నెర్రెల్లో ద్విచక్రవాహనాల చక్రాలు పడి ప్రమాదాలకు గురవుతున్నామని స్థానికులు వాపోతున్నారు. **- న్యూస్‌టుడే, యలమంచిలి**



శుద్ధ జలాలు వృథా



నరసాపురం పట్టణంలోని పార్కు రోడ్డులో తాగునీటి సరఫరా చేసే గేట్ వాల్వు నుంచి లీకై శుద్ధ జలాలు వృథాగా పోతున్నాయి. దీంతో పరిసరాల్లో కుళాయిలతో అందే తాగునీరు కలుషితం అవుతున్నాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. గతంలో ఇదే వాల్వు రెండు, మూడు సార్లు మరమ్మతులకు గురై నెలలు తరబడి నీరు వృథాగా పోయాయి. గతంలో మరమ్మతులు చేయించినా మళ్లీ అదే పరిస్థితి కనిపిస్తోంది. ఈ విషయమై పురపాలక డీఈ ఆర్.గంగా వరప్రసాద్ మాట్లాడుతూ.. పరిశీలించి మరమ్మతులకు చర్యలు తీసుకుంటామన్నారు. **- న్యూస్‌టుడే, నరసాపురం పట్టణం**

నీరుగారుతున్న లక్ష్యం



పాలకొల్లు మండలం లంకలకోడేరులో నిర్మించిన సంపద కేంద్రం నిరుపయోగంగా దర్శనమిస్తోంది. చెత్త నుంచి సంపద సృష్టించాలనే లక్ష్యంతో ప్రభుత్వం వీటిని ప్రతి గ్రామంలో నిర్మించింది. ఇలా వదిలేయడంతో లక్ష్యం నీరుగారుతోంది. **- న్యూస్‌టుడే, పాలకొల్లు గ్రామీణ**

పొంచి ఉన్న ప్రమాదం

సరిపల్లి నుంచి నరసాపురం వెళ్లే ప్రధాన రహదారి చెంత గొయ్యి తవ్వి అలాగే వదిలేశారు. దీంతో అది ప్రస్తుతం ప్రమాదకరంగా మారింది. రాత్రి సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. రహదారి చెంత ఉన్న గొయ్యిని పూడ్చేందుకు చర్యలు చేపట్టాలని చోదకులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, నరసాపురం గ్రామీణ**



ఆదమరిస్తే అంతే



పంట కాలువలపై నిర్మించిన వంతెనల నిర్వహణ విషయంలో అధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారు. పోలమూరు పరిధిలో నాగళ్లమెరకకు సమీపాన నేలపొగుల కాలువపై నిర్మించిన వంతెన ప్రాంతం ప్రమాదకరంగా మారింది. వంతెనకు ఇరువైపులా గోడలు తక్కువ ఎత్తులో ఉండటంతో పాటు కుడి వైపు రహదారి అంచు కుంగి గుంతలుగా మారింది. ఈ విషయమై ఆర్అండ్‌బీ ఏఈ యశ్వంత్ మాట్లాడుతూ.. పరిశీలించి మరమ్మతులు చేయిస్తామన్నారు. **- న్యూస్‌టుడే, పెనుమంట్ర**

పుష్కరాలకు ప్రభుత్వం ఎక్కువ నిధులు మంజూరు చేయాలి

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: రానున్న పుష్కరాలకు నరసాపురం పట్టణానికి ప్రభుత్వం ఎక్కువ నిధులు మంజూరు చేయాలని సర్వంచుల ఛాంబర్ మాజీ అధ్యక్షుడు కూనపరెడ్డి రంగారావు ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. గత పుష్కరాలకు రూ.41 కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. పవిత్రమైన వశిష్ఠ గోదావరి తీరం వెంబడి ఉన్న స్నాన ఘట్టాలు, దేవాలయాలు, భక్తులు రాకపోకలకు సాగించే మార్గాలు, దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం రూ.15కోట్ల నిధులు కేటాయించడం ఎంత మాత్రం సరికాదని రంగారావు అన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో పతకాలు

పెనుమంట్ర, న్యూస్‌టుడే: తిరుపతిలో జరిగిన అమరావతి ఛాంపియన్‌షిప్ రాష్ట్ర స్థాయి పోటీల్లో పెనుమంట్రకు చెందిన ముగ్గురు పతకాలు సాధించినట్లు కోచ్ చిరంజీవి తెలిపారు. బాలికల విభాగంలో బి.నదియా బంగారం, కె.శరణ్య రజిత పతకాలు, బాలుర విభాగంలో ప్రదీప్ కాంస్య పతకం సాధించినట్లు చెప్పారు. వీరిని శాప్ ఛైర్మన్ రవి నాయుడు తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర ప్రత్యేకంగా అభినందించి ప్రశంసాపత్రాలు, పతకాలు అందజేసినట్లు తెలిపారు. విజేతలకు కోచ్‌లుగా కేటీవీ శైలజ, కె.మాధవి, వీకేఎన్ఎస్.ప్రసాద్ వ్యవహరించారన్నారు. బాక్సింగ్‌లో ప్రతిభ కనబరుస్తున్న క్రీడాకారులను ఆదివారం మార్టేరులో మానవత ఆధ్వర్యంలో సత్కరించారు.

వైద్య శిబిరానికి స్పందన


చీరలు అందిస్తున్న సూర్యనారాయణ, నాగతులసి దంపతులు

యలమంచిలి, న్యూస్‌టుడే: బూరుగుపల్లిలో పెనుగొండ సీతారామయ్య-సత్యవతి జ్ఞాపకార్థం పాలకొల్లు సీనియర్ సిటిజన్స్ ఆధ్వర్యంలో ఉచిత కంటి, చర్మ వ్యాధుల శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. శిబిరంలో నేత్ర వైద్యనిపుణులు గనిశెట్టి వెంకటకృష్ణ, చర్మ వ్యాధి నిపుణులు పెనుగొండ రాజిత పాల్గొని 40 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. పెనుగొండ సూర్యనారాయణ-నాగతులసి విరాళంతో వృద్ధులకు బియ్యం, దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ సంఘ అధ్యక్షుడు యర్రంశెట్టి వెంకటరత్నం, ప్రధాన కార్యదర్శి జీఎస్ఎన్ మూర్తి, సభ్యులు యర్రమిల్లి నరసింహారావు, కలిదిండి వెంకటపతివర్మ, సలాది సత్యనారాయణమూర్తి, దేవరపు మల్లేశ్వరరావు, జడ్డు బదరీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం


ప్రమాణస్వీకారం చేస్తున్న సంఘ సభ్యులు

నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: నరసాపురంలోని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఆదివారం ప్రమాణ స్వీకారం చేసింది. స్థానిక అల్లూరి సాంస్కృతిక కేంద్రంలో నిర్వహించిన సంఘ సమావేశంలో నూతన కార్యవర్గం అధ్యక్షుడిగా పెన్మెత్స సత్యనారాయణరాజు(బాబుశ్రీ), గౌరవ అధ్యక్షుడిగా నెక్కంటి సుబ్బారావు, గౌరవ సలహాదారుడిగా షేక్ శిలార్ సాహెబ్, వ్యవస్థాపక అధ్యక్షుడిగా అందే రంగారావు, ఉపాధ్యక్షులుగా పొన్నాడ సుబ్రహ్మణ్యం, కప్పల తిమోతిపాల్, కార్యదర్శిగా శిరిగినీడి భవానిశంకర్, జాయింట్ సెక్రటరీలుగా సలాది రామారావు, మంగెన వెంకట కృష్ణమాచార్యులు, కోశాధికారి పితాని సత్యనారాయణ, సంయుక్త కోశాధికారి రుద్రరాజు రామకృష్ణంరాజులతో పాటు మరో పది మంది సభ్యులుగా, నలుగురు మహిళా ప్రతినిధులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని బాబుశ్రీ తెలిపారు.

చలో విజయవాడ విజయవంతానికి పిలుపు


గోడపత్రం ఆవిష్కరిస్తున్న నాయకులు

వాసవీ పెనుగొండ, గ్రామీణ, న్యూస్‌టుడే: సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానం(ఓపీఎస్)ను పునరుద్ధరించాలని కోరుతూ వచ్చే నెల 1న విజయవాడలో నిర్వహించనున్న మహాధర్నా, భారీ నిరసన ర్యాలీ పోస్టర్‌ను ఆదివారం దేవ జడ్పీ పాఠశాల ఆవరణలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏపీసీపీఎస్ఈఎస్ఏ నాయకులు అంజూరి గణేష్, పాలూరి పోతురాజు, కడలి సాంబమూర్తి మాట్లాడుతూ.. సీపీఎస్ విధానం ఉద్యోగుల పదవీ విరమణ అనంతరం సామాజిక, ఆర్థిక భద్రతకు విఘాతం కలిగిస్తోందన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున తరలివచ్చి ధర్నా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సత్యప్రియరామ్, గుబ్బల శ్రీనివాస్, మెరుపు శీనుబాబు, కౌరు విజయకృష్ణ, గుత్తుల శ్రీనివాసరావు, బిరుదుగంటి కుమార్, కంతేటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత


శిక్షకుడు విశ్వేశ్వరరావును సత్కరిస్తున్న సభ్యులు

పెనుమంట్ర, న్యూస్‌టుడే: ధ్యానంతో శారీరక, మానసిక ఆరోగ్యం సిద్ధిస్తుందని కాకినాడ జిల్లాకు చెందిన పిరమిడ్ శిక్షకుడు ఎన్.విశ్వేశ్వరరావు అన్నారు. పెనుమంట్రలో భూపతిరాజు వెంకట శ్రీనివాసరాజు, సాయిగీత నిర్మించిన డాక్టర్ బ్రహ్మర్షి పితామహ పత్రీజీ పిరమిడ్ ధ్యాన మందిరంలో ఆదివారం ఉచిత ధ్యాన శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధ్యానంతో మానసిక ప్రశాంతత, శాకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తాయన్నారు. సీనియర్ పిరమిడ్ శిక్షకుడు వాసు మాట్లాడుతూ.. ఈ ఏడాది నవంబర్‌లో గోదావరి నదీ తీరాన శ్రీవశిష్ఠ గౌతమీ పిరమిడ్ ధ్యాన మహాశక్తి క్షేత్రంలో ఏడు రోజుల పాటు ధ్యాన మహా యజ్ఞం జరుగుతుందన్నారు. అనంతరం అందరితో సామూహిక ధ్యానం నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులంతా ఆయనను సత్కరించారు. కార్యక్రమంలో రాధ, రమణి, తులసమ్మ, తదితరులు పాల్గొన్నారు.

అదుపుతప్పి కాలువలో పడిన మినీ వ్యాను



పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: ఊకతో వెళ్తున్న మినీ వ్యాన్ అదుపుతప్పి నరసాపురం ప్రధాన కాలువలో పడిన ఘటన పాలకొల్లు టిడ్కో గృహాల వద్ద ఆదివారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం... పాలకొల్లు నుంచి నరసాపురం వైపు వెళ్తున్న వ్యాన్ కాలువలో పడటంతో స్థానికులు వెంటనే అక్కడకు చేరుకుని వ్యాన్ తలుపు తీశారు. దీంతో అందులో ఉన్న చోదకుడితో పాటు మరో ఇద్దరు బయటకు వచ్చారు. ఎటువంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

ద్విచక్ర వాహనాల చోరుడి అరెస్టు

కైకలూరు, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనాలు చోరీలకు పాల్పడుతున్న వ్యక్తిని ఆదివారం అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు కైకలూరు గ్రామీణ ఠాణా ఎస్సై రాంబాబు తెలిపారు. ఇటీవల ద్విచక్ర వాహనం చోరీ జరిగిన ఘటనపై మండలంలోని నత్తగుళ్లపాడుకు చెందిన రాంపాలుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ క్రమంలో మండలంలోని పల్లెవాడలో ఆదివారం ఓ వ్యక్తి ద్విచక్ర వాహనంపై అనుమానాస్పదంగా సంచరిస్తున్నట్లు వచ్చిన సమాచారంతో ఎస్సై సిబ్బందితో కలిసి ఆయనను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో భాగంగా నరసాపురానికి చెందిన పాత నిందితుడు బొబ్బిలి భాస్కరరావుగా గుర్తించారు. గతంలో ఇతను అనేక పోలీస్ స్టేషన్ల పరిధిలో చోరీ కేసుల్లో నిందితుడిగా ఉన్నట్లు చెప్పారు. ఆయన నుంచి మూడు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్సై తెలిపారు.

స్వచ్ఛంగా రేవులు.. మెరిసేలా రోడ్లు


రహదారి మరమ్మతులకు నిర్మాణ సామగ్రి

నరసాపురం, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పర్యటన సందర్భంగా పట్టణంలోని గోదావరి రేవులను స్వచ్ఛంగా.. పలు రహదారులను మెరిసేలా పురపాలక అధికారులు అభివృద్ధి చేస్తున్నారు. పట్టణంలోని పలు శ్మశాన వాటికల్లో పేరుకుపోయిన చెత్త, మట్టిని తొలగించి పారిశుద్ధ్యకార్మికులతో శుభ్రం చేయిస్తున్నారు. ప్రధాన రహదారులపై ఏర్పడిన గుంతలు పూడ్చిమరమ్మతులు చేస్తున్నారు. ఏటిగట్టు మరమ్మతులు నిర్వహిస్తున్నారు.


గోదావరి రేవులను శుభ్రం చేస్తున్న కార్మికులు

తాడేపల్లిగూడెం
•తాడేపల్లిగూడెం •తణుకు

శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి విరాళం



దాతకు పత్రాన్ని అందజేస్తున్న సూపరింటెండెంట్ రామారావు

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ప్రముఖ పుణ్యక్షేత్రం ద్వారకాతిరుమల వెంకటేశ్వర స్వామి నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం సమకూరింది. తణుకు పట్టణానికి చెందిన ఉరుగంటి లలిత శివజ్యోతి ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ సూపరింటెండెంట్ రామారావు దాతను ప్రత్యేకంగా అభినందించి స్వామివారి ప్రసాదాలు, నిత్యాన్నదాన పత్రాన్ని అందజేశారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో పతకాలు

పెనుమంట్ర, న్యూస్‌టుడే: తిరుపతిలో జరిగిన అమరావతి చాంపియన్‌షిప్ రాష్ట్ర స్థాయి పోటీల్లో పశ్చిమగోదావరి జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన పెనుమంట్రకు చెందిన ముగ్గురు పతకాలు సాధించారు. ఈమేరకు కోచ్ చిరంజీవి ఆదివారం వివరాలను వెల్లడించారు. బాలికల విభాగంలో వి.నదియా బంగారం, కె.శరణ్య రజతం, బాలుర విభాగంలో ప్రదీప్ కాంస్య పతకం సాధించినట్లు చెప్పారు. వీరిని శాప్ ఛైర్మన్ రవి నాయుడు తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ప్రత్యేకంగా అభినందించి ప్రశంసాపత్రాలు, పతకాలు అందజేసినట్లు తెలిపారు. విజేతలకు కోచ్‌లుగా కేజేవీ తేజ, కె.మాధవి, వీకేవీఎస్.ప్రసాద్ వ్యవహరించారన్నారు. బాక్సింగ్‌లో ప్రతిభ కనబరుస్తున్న క్రీడాకారులను ఆదివారం మార్టేరులో మానవత ఆధ్వర్యంలో సత్కరించారు.

మహిళలను చిరు వ్యాపారులుగా మారుద్దాం



మన్‌కీబాత్‌ను వీక్షిస్తున్న భాజపా నాయకులు

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: పీఎం స్వనిధి ద్వారా 46 లక్షల మంది మహిళలు చిరు వ్యాపారులుగా లబ్ధి పొందుతున్నారని నర్సాపురం పార్లమెంట్ నియోజకవర్గ మీడియా ఇన్‌ఛార్జి నరిశే సోమేశ్వరరావు అన్నారు. తాడేపల్లిగూడెం పట్టణం సవిత్యపేటలోని శక్తి కేంద్రంలో ప్రధాని మోదీ మన్‌కీబాత్ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఓకల్ ఫర్ లోకల్ ద్వారా దీపావళి సామాన్లు కానీ అనేక రకాల కార్యక్రమాలు మహిళలు ఆర్థిక పరిపుష్టికి దోహదపడుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాజపా పట్టణ అధ్యక్షుడు దువ్వా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను సత్కరించుకుందాం

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే: సెప్టెంబరు 5న ఉపాధ్యాయుల దినోత్సవాన్ని పురస్కరించుకొని అత్తిలి మండలంలో విశేష సేవలందించే ఉపాధ్యాయులను సత్కరించుకుందామని తీర్మానించుకున్నట్లు అత్తిలి మండల మానవత సేవా సంస్థ ఛైర్మన్ ఆనాల ఆదినారాయణ, సభ్యులు తెలిపారు. ఆదివారం అత్తిలి మానవత నెలవారీ సమావేశంలో వచ్చే నెలలో చేయాల్సిన సేవలపై సమీక్షించారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు కొరిపల్లి విజయ్‌కుమార్, తోట సుబ్బారావు, ట్రెజరర్ రామారావు, గొర్లి వెంకట్రావు, కొనగళ్ల అనిల్, ఆకుల ఆంజనేయులు, వాసురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పురపాలక సంఘంలో పీజీఆర్ఎస్ రద్దు

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికను కలెక్టర్ నాగరాణి ఆదేశాల మేరకు తాడేపల్లిగూడెం పురపాలక సంఘంలో సోమవారం రద్దు చేశామని కమిషనర్ ఏసుబాబు ఆదివారం తెలిపారు. పురప్రజలు గమనించగలరని వివరించారు.

విద్యతోనే అభ్యున్నతి

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: విద్యతోనే అభ్యున్నతి సాధ్యమని, ప్రతిభావంతులైన పేద చేయూత నివ్వడం అభినందనీయమని రాజ్యసభ సభ్యుడు పాకా వెంకట సత్యనారాయణ అన్నారు. లక్ష్మీ తార చారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు గూడూరి కపిలేశ్వరరావు, కార్తిక్, సరిత, మైథిలి తార సౌజన్యంతో విద్యార్థులకు ఆదివారం ఉపకార వేతనాలు పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో ఎంపీ పాల్గొని మాట్లాడారు. భీమవరంలోని శ్రీ వేంకటేశ్వర బధిరోన్నత పాఠశాలలో 77 మంది విద్యార్థులకు నూతన వస్త్రాలు, రూ.40 వేల ఉపకార వేతనాలు అందించారు.



ఉపకార వేతనాలు అందుకున్నవారితో ఎంపీ సత్యనారాయణ, నిర్వాహకులు

చెరువు నీరు తాగితే.. చేరువవును రోగమే

పెంటపాడు (తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: పెంటపాడు మండలం పడమరవిప్పర్రు గ్రామంలో ప్రధాన తాగునీటి చెరువు వ్యర్థాలతో కలుషితమవుతోంది. ఈ చెరువు గ్రామానికి ప్రధాన తాగునీటి వనరు కావడంతో ప్రజలు దీనిపై ఆధారపడుతున్నారు. కొంత కాలంగా చెరువు గట్టున పేరుకున్న వ్యర్థాలు, పిచ్చిమొక్కలు పెరిగి అధ్వానంగా తయారయింది. చెరువులో తామర, పసరు పేరుకుని దీర్ఘకాలంగా ఉండటంతో సమస్య ఉత్పన్నమవుతోందని ఆ నీరు తాగి రోగాలబారిన పడుతున్నామని ప్రజలు వాపోతున్నారు.



పసరు తేలిన చెరువు

గ్రామంలో ట్యాంకుల నిర్వహణ ఇలా..

14 ఎకరాల తామర చెరువు ఉంది. ఈ చెరువుకు సమీపాన ఎగువ ప్రాంతాల నుంచి మురుగు నేరుగా చెరువులో కలుస్తుంది. సుదీర్ఘకాలంగా గట్లు మరమ్మతులు చేపట్టకపోవడంతో మురుగు నీరు నేరుగా చెరువులో కలుస్తుంది.

అరకొర సరఫరా..

ప్రధాన ఓవర్‌హెడ్ ట్యాంకు లీకేజీ, వాటర్‌ఫిల్టర్ అంతంత మాత్రం శుభ్రపరచడం, మైక్రోఫిల్టర్ నిర్వహణ సరిగాలేకపోవడం గ్రామస్థులకు శాపంగా మారింది. జల్‌జీవన్ మిషన్‌లో గ్రామంలో వేసిన పైపులైను మహంకాళమ్మ ఆలయం రోడ్డులో లీకేజీ కావడంతో ఆయా ప్రాంతాల వారికి నీటి సరఫరా ఇబ్బందికరంగా మారింది. అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోవడంతో స్థానికులు ఆవేదన చెందుతున్నారు.

శివారుకు చేరని జలాలు..

గ్రామంలో శివారు ప్రాంతాలకు నీరు చేరక జల్‌జీవన్‌మిషన్‌లో నూతనంగా ట్యాంకు నిర్మించినా దాన్ని ప్రారంభించక నిరుపయోగంగా మారింది. దీంతో ఆయా ప్రాంతాల వారు తాగునీటికి ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి స్వచ్ఛమైన నీటిని సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి కృషి..

మండలంలోని పడమరవిప్పర్రులో ప్రజలకు స్వచ్ఛమైన నీరు అందేలా చర్యలు చేపడతాం. గ్రామస్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం. **- ఎం.వెంకటేశు, ఎంపీడీవో, పెంటపాడు**

మేమున్నాం.. మీకు తోడుగా..

10 AM to 1 PM

తాడేపల్లిగూడెం	: 99488 53114
తణుకు	: 85558 50851
తణుకు గ్రామీణం	: 63005 79402
అత్తిలి	: 91548 46774

తణుకు పట్టణ న్యూస్‌టుడే: ? పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో దుర్గమ్మ గుడి సమీపంలో డ్రెయినేజీ నిండిపోయి మురుగు కదలకపోవడంతో దుర్వాసన వస్తోంది. **- స్థానికులు**

✔ వర్షాలు తగ్గాక నీరు సాఫీగా ముందుకు సాగేలా చర్యలు చేపడతాం. **- రామ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్**

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: ? తాడేపల్లిగూడెం దొమ్మేరుకాలనీ వెంబడి మురుగునీరు నిలిచిపోవడంతో దోమలు వృద్ధి చెంది కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. **- రమేష్, స్థానికుడు**

✔ నీరు సాఫీగా ముందుకు సాగేలా చేసి దోమల నివారణ చర్యలు చేపడతాం. **- సోమేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

సమస్య: ? తాడేపల్లిగూడెం పీఅండ్‌టీ కాలనీలోని వాసవీ పార్కు అభివృద్ధికి నోచుకోక స్థానికులు ఆహ్లాదానికి దూరమవుతున్నారు. **- అజయ్, స్థానికుడు**

✔ పార్కు అభివృద్ధికి చర్యలు చేపట్టాం త్వరితగతిన అందుబాటులోకి తీసుకు వచ్చేలా కృషి చేస్తాం. **- ఎం.ఏసుబాబు, పురపాలక కమిషనర్**

కృష్ణబాబు ఎంతో మందికి స్ఫూర్తి: ఆరిమిల్లి



నివాళులర్పిస్తున్న రాధాకృష్ణ

తణుకు, న్యూస్‌టుడే: అయిదు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికై అటు రాజకీయంగా ఇటు ప్రజా సేవలో ఎంతో మందికి స్ఫూర్తిగా నిలిచిన కొవ్వూరు మాజీ ఎమ్మెల్యే పెండ్యాల వెంకటకృష్ణారావు (కృష్ణబాబు) సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. ఆదివారం కొవ్వూరు 4వ బ్రిడ్జి కూడలిలో కృష్ణబాబు విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు.

తణుకు, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో ప్రతిభను పోత్సహించేందుకు గురుజుకోట నాగరామ శంకర్ సేవా ట్రస్ట్ ఏటా ప్రతిభా పురస్కార అవార్డులు అందజేయడం అభినందనీయమని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ కొనియాడారు. పది, ఇంటర్మీడియట్‌లో ప్రతిభ కనబరిచిన 60 మంది విద్యార్థులకు ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక లయన్స్ క్లబ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రతిభా పురస్కారాల పంపిణీ కార్యక్రమంలో శనివారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ ఛైర్మన్ తుగ్గలి నాగేంద్ర, భాజపా జిల్లా అధ్యక్షురాలు అయినంపూడి శ్రీదేవి, భాజపా ఎన్టీఆర్ జిల్లా ఇన్‌ఛార్జి తాతాజీ, సినీ గేయ రచయిత రసరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కవి సమ్మేళనం



ప్రసాద్‌ను సత్కరిస్తున్న నిర్వాహకులు

తణుకు, న్యూస్‌టుడే: గిడుగు రామమూర్తి పంతులు జయంతిని పురస్కరించుకుని శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన కవి సమ్మేళనంలో పట్టణానికి చెందిన వీఎస్‌వీ ప్రసాద్ తన ప్రతిభను చాటుకున్నారు. కొయ్యలగూడెంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గిడుగు రామమూర్తి పంతులు వ్యావహారిక భాషోద్యమాన్ని నడిపిన తీరును వివరించారు. ఈ సందర్భంగా ప్రసాద్‌ను ఘనంగా సత్కరించారు. శ్రీశ్రీ కళావేదిక ప్రణాళిక అధికారి డా టి.పార్థసారథి, ప్రకాశం విద్యాసంస్థల కరస్పాండెంట్ జి.కుసుమకుమారి, అధ్యాపకులు కోటేశ్వరరావు, పవన్ తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండండి



యువతకు కౌన్సెలింగ్ ఇస్తున్న శ్రీనివాసరావు

తణుకు, న్యూస్‌టుడే: వీరభద్రపురం జీడీఎం చర్చిలో ఆదివారం గ్రామీణ ఎస్సై నాళం శ్రీనివాసరావు చర్చిలోని విశ్వాసులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దొంగతనాలు, సైబర్‌క్రైమ్, చిన్నారులపై జరుగుతున్న అఘాయిత్యాలు, చీటింగ్ కేసుల నివారణకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో చర్చి పాస్టర్లు, విశ్వాసులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

✦ తణుకు గ్రామీణ ఎస్సై నాళం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మండలంలోని అనుమానాస్పద ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాలతో గస్తీ నిర్వహించి యువతకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

✦ ఇరగవరం ఎస్సై ఎండీ.నసీరుల్లా ఆధ్వర్యంలో రేలంగిలోని పలు అనుమానాస్పద ప్రాంతాల్లో డ్రోన్‌తో గస్తీ నిర్వహించి యువతకు మత్తు, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని కోరారు.

హామీలు అమలు చేయండి: సీపీఎం



మాట్లాడుతున్న గోపాలన్

భీమవరం వన్‌టౌన్, న్యూస్‌టుడే: కోటిపల్లి- నరసాపురం రైల్వే లైను పనులు ప్రారంభించి పుష్కరాల లోపు పూర్తి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జేఎన్‌వీ గోపాలన్ కోరారు. మెంటేవారితోటలోని సుందరయ్య భవనంలో ఆదివారం సీపీఎం జిల్లా సమావేశాన్ని ఆ పార్టీ నాయకుడు బి.వాసుదేవరావు అధ్యక్షతన నిర్వహించారు. గోపాలన్ మాట్లాడుతూ రైల్వే లైను పనుల్లో జాప్యం కారణంగా అంచనా వ్యయం రూ.2 వేల కోట్ల నుంచి రూ.4 వేల కోట్లకు పెరిగిందన్నారు. బియ్యపుతిప్ప వద్ద షిప్పింగ్ హార్బర్‌కు 2002లో శంకుస్థాపన చేయగా పనులు మధ్యలో నిలిచిపోయాయన్నారు. భీమవరం పట్టణంలో కంపోస్టు యార్డు ఏర్పాటు చేయాలన్నారు.

ఇంటింటికీ ఉచిత వైద్యం



రోగిని పరీక్షిస్తున్న వైద్యులు

తణుకు, న్యూస్‌టుడే: సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్తంగా ఆదివారం ఇంటింటికీ వైద్య కార్యక్రమం నిర్వహించారు. సంచార శకటం ద్వారా ప్రముఖ నేత్ర వైద్యుడు డా హుస్సేన్ అహ్మద్ పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించి ఏడుగురు వృద్ధులకు వైద్య సేవలు అందించారు. వల్లూరి సుధాకర్ చౌదరి ఆర్థిక సహకారంతో ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఉచిత వైద్య సేవలు కావాల్సిన వారు స్వయంగా కార్యాలయాన్ని సంప్రదించవచ్చని లేదా సెల్: 998 534 3530, 905 929 0717 నెంబర్లను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు కరుణాకర్ చౌదరి, కోశాధికారి ఆర్జి భాస్కరరావు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

7న తుది ఓటర్ల జాబితా ప్రచురణ

ఇరగవరం, న్యూస్‌టుడే: మండలంలో గ్రామాల వారీగా ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓటర్ల జాబితాపై గడువులోగా వచ్చిన అభ్యంతరాలను, క్లెయిమ్‌లు పరిశీలిస్తున్నామని ఎంపీడీవో ఎ.శ్రీనివాసు ఆదివారం తెలిపారు. వీటిని విచారణ చేసిన అనంతరం జాబితా రూపొందిస్తామన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓటర్ల తుది ఎన్నికల జాబితాను సెప్టెంబర్ 7న అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ప్రచురిస్తామని ఆయన వివరించారు.

రోడ్డు పక్కన గొయ్యి.. చూసి అడుగెయ్యి



తణుకు పట్టణం న్యూస్‌టుడే: దువ్వ గ్రామంలోని కమ్మవారి రామాలయం సమీపంలోని రోడ్డు పక్కన ఉన్న మంచి నీటి జాయింట్ గొయ్యి పైపుపై ఏర్పాటు చేసిన రాయి విరిగిపోవడంతో గొయ్యి ప్రమాదకరంగా మారింది. పాఠశాలకు వెళ్లే విద్యార్థులు, వాహన చోదకులు రాకపోకల సమయంలో గొయ్యి గుర్తించలేక ప్రమాదాలకు గురవుతున్నామని వాపోతున్నారు. తాత్కాలికంగా కర్రను ఏర్పాటు చేసినా భద్రతకు సరిపడే చర్యలు కనిపించడం లేదు. మూత ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

అధ్వానంగా కాలువ రేవులు



తణుకు, న్యూస్‌టుడే: పట్టణంలోని గోస్తనీ కాలువకు ఆనుకుని ఏర్పాటు చేసిన రేవులు పలు చోట్ల అధ్వానంగా మారాయి. వ్యర్థాలు మెట్లపై వేయడంతో పాటు పలువురు అక్కడ మల విసర్జన చేయడంతో దుర్భరంగా మారుతున్నాయి. ఆయా ప్రాంతాల స్థానిక మహిళలు అక్కడ బట్టలు ఉతికేందుకు, పలువురు ఆలయాలకు వెళ్లి కాళ్లు కడుక్కునేందుకు రేవుల వద్దకు వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని కమిషనర్ రామ్‌కుమార్ తెలిపారు.

ప్రహరీ లేక ఇక్కట్లు

పెంటపాడు (తాడేపల్లిగూడెం టూటౌన్), న్యూస్‌టుడే: పెంటపాడు మండల పరిధిలోని పడమర విప్పర్రు ప్రధాన రహదారి పక్కనే అంగన్‌వాడీ కేంద్రానికి ప్రహరీ లేదు. వాహన రద్దీ ఉండే వీధిలో ఉన్న ఈ కేంద్రం ముందు చిన్నారులు ఆటలు ఆడుకునే పరిస్థితి లేదు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి కేంద్రానికి ప్రహరీ నిర్మించాలని చిన్నారుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



వంతెన శిథిలం..



ఇరగవరం, న్యూస్‌టుడే: ఇరగవరం నుంచి ఏలేటిపాడు వెళ్లే మార్గంలో వేంద్రవారిపాలెం వద్ద రాపాక కాలువపై ఉన్న వంతెన శిథిలావస్థకు చేరింది. అంతేగాక రెయిలింగ్ సైతం ఇరువైపులా కొంత భాగం దెబ్బతింది. పదేళ్ల కిందటే వంతెనకు ఒక భాగం కుంగిపోవడంతో అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేశారు. కొత్త వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు చేసి ఏళ్లు గడుస్తున్నా, ఇంత వరకు అమలుకు నోచుకోలేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొత్త వంతెన నిర్మాణానికి అధికారులు చర్యలు తీసుకోవాలని వాహనచోదకులు కోరుతున్నారు.

రహదారి పక్కనే చెత్తకు నిప్పు



ఇరగవరం, న్యూస్‌టుడే: రేలంగి నుంచి అత్తిలి వెళ్లే మార్గంలో గవర్లపాలెం వద్ద ప్రధాన రహదారి పక్కనే ఇళ్ల నుంచి సేకరించిన చెత్తను గుట్టలుగా వేసి మంట పెడుతున్నారు. ఇది తణుకు నుంచి భీమవరం వెళ్లే ప్రధాన రహదారి కావడంతో నిత్యం వాహనాల రద్దీ ఎక్కువ. దీంతో ఆ ప్రాంతమంతా పొగ కమ్మి ప్రమాదాలకు దారితీస్తుంది. రహదారి పక్కన ఉన్న చెత్తను తొలగించి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రానికి తరలించాలని కోరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అనుమతులొచ్చాయ్.. వెతలు తీరనున్నాయ్

ప్రత్తిపాడు (తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: తాడేపల్లిగూడెం మండలం నుంచి ప్రధాన రహదారికి వెళ్లాలంటే పెంటపాడు మండలం ప్రత్తిపాడు రైల్వేగేటు ఒకటి. గేటు ద్వారా ఆరుగొలను, కొత్తూరు, లింగరాయుడుగూడెం, దండగర్ర, ఉప్పరగూడెం తదితర గ్రామాల ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ప్రధానంగా ఆరుగొలను గ్రామంలో ఉన్న అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాలల్లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా నుంచి వందల సంఖ్యలో విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వారిని వారాంతపు సెలవుల్లో చూసేందుకు వారి తల్లిదండ్రుల వచ్చి వెళుతుంటారు. ఈ క్రమంలో ఆయా గ్రామాల వారితోపాటు విద్యా సంస్థలకు చెందిన వారు సుదీర్ఘకాలంగా అవస్థలు పడుతున్నారు. ఆరుగొలను గ్రామంలో గ్రావెల్ క్వారీ లారీలు సైతం రాకపోకలు సాగించాలంటే ప్రత్తిపాడు గేటు కీలకం. దీంతో నిత్యం వాహన చోదకులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



ఆర్వోబీ నిర్మించనున్న ప్రత్తిపాడు గేటు

ఎమ్మెల్యే, కేంద్ర మంత్రి చొరవ..

తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాస్ వర్మ ఆర్వోబీ నిర్మాణానికి తీవ్రంగా కృషి చేశారు. అందుకు అధికారులు యుద్ధ ప్రాతిపదికన ప్రత్తిపాడు లెవల్ క్రాసింగ్ గేటునెం.376కు ఆర్వోబీలు(రైల్వే ఓవర్ బ్రిడ్జి), డీపీఆర్‌లు సిద్ధం చేసి సంబంధిత కార్యాలయాలకు అందజేశారు. దీంతో వాహన చోదకులు, ప్రయాణికుల వెతలు తీరనున్నాయి.

భూసేకరణ సమస్య పరిష్కారం..

ఆర్వోబీ నిర్మాణానికి య.1.885 ఎకరాల ప్రభుత్వ, యజమానుల నుంచి భూసేకరణ జరిగింది. దీంతో ఆర్వోబీ నిర్మాణానికి అనుమతులు మంజూరయ్యాయి.

- కరుటూరి సూర్యనారాయణ, ఛీఫ్ ఇంజినీర్, విజయవాడ

వైభవంగా కోట్లమ్మ సంబరం



చేబ్రోలు(ఉంగుటూరు): చేబ్రోలు గ్రామ దేవత కోట్లమ్మ శ్రావణ మాస సంబరాన్ని ఆదివారం నిర్వహించారు. గ్రామస్థులు అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి సలివిడి పానకాలు పోశారు. తీన్‌మార్ డప్పులు, బాణసంచా పేలుళ్ల నడుమ గరగలతో అమ్మవారిని ఊరేగించారు. ఏర్పాట్లను ఆలయ కమిటీ సభ్యులు కర్ణం బుజ్జి, పిట్టా శివయ్య, బొమ్మిడి అప్పారావు, యెలిశెట్టి పాపారావు, బాబ్జి పర్యవేక్షించారు.

సామాజిక పింఛన్.. త్వరలో వచ్చేన్

☛ కొత్త వాటికి సెప్టెంబర్ నుంచి దరఖాస్తుల స్వీకరణ

● గణపవరానికి చెందిన గంగుమోగుల నాగమణి భర్త మూడేళ్ల కిందట మరణించారు. చిన్నాచితకా పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించే భర్త మృతితో ఆమె జీవితం తలకిందులైంది. అటు కూలి పనులకు వెళ్లలేక, ఇళ్లలో పని చేసే శక్తి లేక వితంతు పింఛనుకు ఆశగా ఎదురు చూస్తున్నారు.

● భీమడోలు మండలం కురెళ్లగూడేనికి చెందిన ఈగలపాటి కిరణ్మయి భర్త రెండేళ్ల కిందట మృతి చెందారు. వారికి సెంటు వ్యవసాయ భూమి లేకపోయినా.. ఆన్‌లైన్‌లో ఏడెకరాలు ఉన్నట్లు చూపడంతో తల్లికి వందనం నగదు సైతం జమ కాలేదు. వితంతు పింఛనుకు కోసం ఏడాదిన్నర కిందట దరఖాస్తు చేసినా ఇప్పటికీ మంజూరు కాలేదు.

గణపవరం, భీమడోలు, నిడమర్రు గ్రామీణ, ఉంగుటూరు- న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సామాజిక పింఛన్లను రూ.3 వేల నుంచి రూ.4 వేలు పెంచింది. ఏడాది పాలన పూర్తయ్యాక స్పౌజ్ పింఛన్లకు లైన్ క్లియర్ చేసింది. తాజాగా రెండేళ్ల పాలన పూర్తయిన నేపథ్యంలో.. కొత్తగా వితంతు, వృద్ధాప్య, దివ్యాంగ పింఛన్లు మంజూరు చేసేందుకు చర్యలు చేపట్టింది. రాష్ట్ర వ్యాప్తంగా 3 లక్షల కొత్త పింఛన్లకు పచ్చ జెండా ఊపడంతో ఆశావహుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. సెప్టెంబర్ నుంచి దరఖాస్తులు స్వీకరించి అక్టోబర్ లేదా నవంబర్ నుంచి పింఛన్ల పంపిణీకి ప్రభుత్వం అడుగులేస్తోంది.

నియోజకవర్గంలో దరఖాస్తు చేశారిలా..

మండలం	వితంతు	వృద్ధాప్యం
గణపవరం	396	711
నిడమర్రు	176	514
ఉంగుటూరు	364	806
భీమడోలు	352	583

మొత్తం 3,902 దరఖాస్తులు..

ఉంగుటూరు నియోజకవర్గంలో 3,902 మంది వితంతు, వృద్ధాప్య పింఛన్లకు దరఖాస్తు చేసుకున్నారు. తొలుత వితంతు, తర్వాత వృద్ధాప్య పింఛన్లు మంజూరు చేయనున్నారు. వీరిలో అర్హులెందరు ఉన్నారో తేల్చే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. అర్హుల జాబితా పూర్తయ్యాక నియోజకవర్గంలో ఎంత మందికి లబ్ధి చేకూరుతుందో నిర్ణయం తీసుకోనున్నారు.

బంగారం చోరీపై కేసు

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఆర్టీసీ బస్సులో తాడేపల్లిగూడెం నుంచి జంగారెడ్డిగూడెం మండలం తాడువాయికి మన్నె పార్వతి అనే మహిళ తన మనవరాలితో వెళుతుంది. ఈ క్రమంలో పట్టణంలోని మథర్‌వన్నిని ఆసుపత్రి వద్ద మనవరాలికి పాల డబ్బా కోసం బ్యాగు తీయగా అందులోని బంగారు హారం, ఉంగరం కనిపించలేదన్నారు. దీనిపై తాడేపల్లిగూడెం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేయగా ఎస్సై రవికుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామన్నారు.

జూద శిబిరంపై దాడి

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే: అత్తిలి శివారు గంటావారి పుంతలో డంపింగ్‌యార్డు వద్ద జూద శిబిరంపై దాడి చేసి అత్తిలికి చెందిన ఎనిమిది మందిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. అత్తిలి గంటావారి పుంతలో డంపింగ్‌యార్డు వద్ద జూదం ఆడుతున్నారని అందిన సమాచారం మేరకు జూద శిబిరంపై దాడి చేసి ఎనిమిది మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.4440 నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై విశ్వనాథ్ తెలిపారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత



శిక్షకుడు విశ్వేశ్వరరావును సత్కరిస్తున్న సభ్యులు

పెనుమంట్ర, న్యూస్‌టుడే: ధ్యానంతో శారీరక, మానసిక ఆరోగ్యం సిద్ధిస్తుందని కాకినాడ జిల్లాకు చెందిన పిరమిడ్ శిక్షకుడు ఎన్.విశ్వేశ్వరరావు అన్నారు. పెనుమంట్రలో భూపతిరాజు వెంకట శ్రీనివాసరాజు, సాయిగీత నిర్మించిన డాక్టర్ బ్రహ్మర్షి పితామహ పత్రీజీ పిరమిడ్ ధ్యాన మందిరంలో ఆదివారం ఉచిత ధ్యాన శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధ్యానంతో మానసిక ప్రశాంతత, శాకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తాయన్నారు. సీనియర్ పిరమిడ్ శిక్షకుడు వాసు మాట్లాడుతూ.. ఈ ఏడాది నవంబర్‌లో గోదావరి నదీ తీరాన శ్రీవశిష్ఠ గౌతమీ పిరమిడ్ ధ్యాన మహాశక్తి క్షేత్రంలో ఏడు రోజుల పాటు ధ్యాన మహా యజ్ఞం జరుగుతుందన్నారు. అనంతరం అందరితో సామూహిక ధ్యానం నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులంతా ఆయనను సత్కరించారు. కార్యక్రమంలో రాధ, రమణి, తులసమ్మ, తదితరులు పాల్గొన్నారు.

అదుపుతప్పి కాలువలో పడిన మినీ వ్యాను

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: ఊకతో వెళ్తున్న మినీ వ్యాన్ అదుపుతప్పి నరసాపురం ప్రధాన కాలువలో పడిన ఘటన పాలకొల్లు టిడ్కో గృహాల వద్ద ఆదివారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం... పాలకొల్లు నుంచి నరసాపురం వైపు వెళ్తున్న వ్యాన్ కాలువలో పడటంతో స్థానికులు వెంటనే అక్కడకు చేరుకుని వ్యాన్ తలుపు తీశారు. దీంతో అందులో ఉన్న చోదకుడితో పాటు మరో ఇద్దరు బయటకు వచ్చారు. ఎటువంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

వయసుకు తగ్గట్టు.. పోషకాలు అందేట్టు

✦ అంగన్‌వాడీలో సరికొత్త మెనూ



అంగన్‌వాడీ కేంద్రంలో భోజనాలు చేస్తున్న చిన్నారులు

పెంటపాడు (తాడేపల్లిగూడెం టూటౌన్), న్యూస్‌టుడే: ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధికి పలు చర్యలు తీసుకుంటుంది. కేంద్రాలకు వచ్చే గర్భిణులు, బాలింతలకు, చిన్నారులకు సరికొత్త మెనూను ప్రవేశపెట్టనుంది. ఇప్పటి వరకు అందరికీ ఒకే రకమైన ఆహారం అందించే పద్ధతికి స్వస్తి పలికి, పిల్లల శారీరక ఎదుగుదల, వయసుకు తగినట్లు పోషకాలు అందించేలా ఈ నూతన విధానాన్ని తీసుకొచ్చింది.

మూడు వర్గాలుగా విభజించి..

పిల్లలను మూడు వర్గాలకు విభజిస్తున్నారు. 7 నుంచి 12 నెలల లోపు చిన్నారులను జూనియర్లుగా, 1 నుంచి 3 సంవత్సరాల లోపు చిన్నారులను సీనియర్లుగా, 3 నుంచి 6 సంవత్సరాల లోపు చిన్నారులను సూపర్ సీనియర్లుగా పిలుస్తారు. ఇందులో సూపర్ సీనియర్ చిన్నారులకు వారంలో రెండ్రోజులు రుచికరమైన ఎగ్ ఫ్రైడ్ రైస్ అందిస్తారు. సాయంత్రం వేళల్లో పిల్లలకు అవసరమైన ప్రొటీన్ లభించేలా ఉడికిన సెనగలను తప్పనిసరిగా అందజేస్తారు. ప్రతి వంటలోనూ మునగాకును తప్పనిసరిగా ఉండేలా చూస్తారు. ప్రస్తుతం ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆదేశాలు రాలేదు. రాగానే కొత్త మెనూ అమలు చేస్తాం.

- సరస్వతి, సీడీపీవో, తాడేపల్లిగూడెం సెక్టార్

తాడేపల్లిగూడెం నియోజకవర్గ సమాచారం

అంగన్‌వాడీ కేంద్రాలు	278
7 నెలల నుంచి మూడేళ్ల లోపు చిన్నారులు	5,460
3 ఏళ్ల నుంచి ఆరేళ్లలోపు బాలలు	4,462
గర్భిణులు	1,088
బాలింతలు	997